

ఇస్కాన్‌లో ప్రత్యేక అలంకరణలో అష్టసఖులతో రాధాగోవిందులు



బాలకృష్ణం భజే

వాడవాడలా వైభవంగా కృష్ణాష్టమి

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 26 : శ్రీకృష్ణాష్టమి వేడుకలను సోమవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. కృష్ణుడి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.తిరుపతిలోని అష్టసఖీ సమేత రాధాగోవింద కమల మందిరం(ఇస్కాన్)లో జన్మాష్టమి వేడుకల్లో భాగంగా ఆలయంలో వేకువ జామున నాలుగు గంటల నుండి మంగళహారతి, తులసి పూజ, నరసింహ కీర్తన జరిగాయి. ఉదయం ఎనిమిది గంటల నుండి రాత్రి 11.45 గంటల వరకు భక్తులను దర్శనానికి అనుమతించారు. సాయంత్రం నాలుగు గంటలకు టీటీడీ మైదానంలో ఉట్లోత్సవం జరిగింది. యువత ఉత్సాహంగా ఇందులో పాల్గొన్నారు. రాత్రి 11 గంటలకు రాధాగోవిందులకు మహాశంఖాభిషేకం నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచే అన్ని క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. సర్వదర్శనం కోసం భక్తులకు రెండు గంటల సమయం పట్టింది. ఇస్కాన్ ఆలయానికి వచ్చే అన్ని దారులు మూసివేసి ఆలయానికి వచ్చేవారిని మాత్రమే అనుమతించారు. తుడా మైదానంలో యాదవ సంఘాలు ఏర్పాటు చేసిన మధుర ఆలయం నమూనా సందర్శకులను ఆకట్టుకుంది.సాయంత్రం 6.30 గంటల నుంచి నృత్యం, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.


ఇస్కాన్ గుడి పక్కనున్న మైదానంలో ఉట్లోత్సవం



తిరుపతి తుడా మైదానంలో కృష్ణాష్టమి వేడుకల్లో ఆకట్టుకున్న గోవర్ధనగిరిధారి, మధుర ఆలయ నమూనా


ఇస్కాన్ ఆలయానికి పోటెత్తిన జనం

పట్టాలెక్కని పాలన

కలెక్టర్, ఎస్పీ వంటి పాలనాధికారులు మినహా మిగిలిన శాఖల అధికారుల బదిలీలు ఇంకా జిల్లాలో మొదలు కాలేదు. కొత్త ప్రభుత్వానికి సంబంధించిన ప్రాధాన్యతా కార్యక్రమాలు, పథకాలపై అస్పష్టత కొనసాగుతోంది. ఎలాగూ బదిలీలు తప్పవన్న తలంపుతో వివిధ శాఖల జిల్లా అధికారులు అన్యమనస్కంగా విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లాలో పాలనను సమన్వయపరచాల్సిన రాజకీయ నాయకత్వం కొరవడింది. ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు దాటినా ఇంకా సర్దుబాట్లలోనే ప్రభుత్వ యంత్రాంగం నిమగ్నమై వుంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



వైసీపీ ప్రభుత్వంలో నియమితులైన వివిధ శాఖల జిల్లా అధికారులే ఇప్పటికీ కొనసాగుతున్నారు. కేవలం కలెక్టర్, జాయింట్ కలెక్టర్, తిరుపతి మున్సిపల్ కమిషనర్ మాత్రమే కొత్త ప్రభుత్వంలో బదిలీపై వచ్చారు. రెవెన్యూలో డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు ఇంకా జరగలేదు. అలాగే జిల్లా పంచాయతీ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, సహకార, డ్వామా, డీఆర్‌డీఏ, వైద్యారోగ్య, విద్య, పరిశ్రమలు, వ్యవసాయ సంబంధ తదితర ముఖ్యమైన శాఖల్లో జిల్లా, డివిజన్ స్థాయి అధికారుల బదిలీలు జరగలేదు. తిరుపతి మినహా మిగిలిన మున్సిపాలిటీల్లో కూడా కమిషనర్లదీ అదే పరిస్థితి. పోలీసు శాఖలో మాత్రమే ఎస్పీ మొదలుకుని అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐల వరకూ బదిలీలు జరిగాయి. ఎస్‌ఐల బదిలీలు కొనసాగుతున్నాయి. తహసీల్దార్లు, ఎంపీడీవోలు ఎన్నికలకు ముందు ఇతర జిల్లాలకు వెళ్లినవారు తిరిగి రాగా మండలాలు కేటాయించారు. ఇది మినహా 90 శాతం జిల్లా, డివిజన్‌స్థాయి అధికారుల బదిలీలు పెండింగులో ఉన్నాయి.

అన్యమనస్కంగా విధుల్లో అధికారులు

కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో ఎలాగూ బదిలీలు తప్పవని వివిధ శాఖల జిల్లా అధికారులు అన్యమనస్కంగా విధులకు హాజరవుతున్నారు. ఆయా స్థానాల్లో కొనసాగే పరిస్థితి లేనందున ఏకాగ్రతగా తమ శాఖల కార్యకలాపాల్లో నిమగ్నం కాలేకపోతున్నారు. చాలా మంది నామమాత్రంగా కార్యాలయాలకు వచ్చి కాలక్షేపం చేసి వెళుతున్నారు. కొందరు ఏదో ఒక మార్గంలో తమకు కావాల్సిన పోస్టింగుల కోసం ప్రయత్నాలు చేసుకుంటుండగా మరికొందరు ఎక్కడికి బదిలీ చేస్తే అక్కడికి వెళదామని ఉత్తర్వుల కోసం నిరీక్షిస్తూ ఉన్నారు. రెవెన్యూతోపాటు వివిధ శాఖల్లో డిప్యుటేషన్‌పై ఉన్న డిప్యూటీ కలెక్టర్లు మాత్రం కీలక పోస్టింగుల కోసం గట్టి ప్రయత్నాల్లో ఉన్నారు.దీంతో పూర్తిస్థాయిలో తమ శాఖలపై దృష్టి కేంద్రీకరించడం లేదు.

కొత్త ప్రభుత్వ ప్రాధాన్యతా పథకాలపై అస్పష్టత

కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు దాటినా ఇంకా ప్రాధాన్యతా పథకాలు, కార్యక్రమాలపై స్పష్టత రావడం లేదు. ఇప్పటికే అమల్లో ఉన్న పథకాలు, కార్యక్రమాల్లో మార్పు చేర్పులపై నిర్ణయం తీసుకోలేదు. అదే సమయంలో కొత్త పథకాలు, కార్యక్రమాలు ఇంకా రూపుదిద్దుకోలేదు. దీంతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు, కార్యక్రమాలకు సంబంధించి కొత్త ప్రభుత్వ ప్రాధాన్యాలేవన్నది జిల్లా అధికారులకు అంతుబట్టడం లేదు. ఫలితంగా వివిధ శాఖల అధికారులు యాంత్రికంగా కార్యాలయాలకు హాజరవుతున్నారు తప్పితే శాఖలపై క్షేత్రస్థాయిలో పర్యటనలు గానీ, పర్యవేక్షణలు గానీ, సమీక్షలు గానీ జరపడం లేదు. ఎలాగూ కొద్ది రోజుల్లో బదిలీ అవుతామన్న భావన దీనికి కారణంగా కనిపిస్తోంది.

కొరవడిన రాజకీయ నాయకత్వం

జిల్లాలో పాలన విషయంలో ప్రజాప్రతినిధులకు, అధికార యంత్రాంగానికీ నడుమ వారధిలా ఉండి సమన్వయపరిచే జిల్లాస్థాయి రాజకీయ నాయకత్వం లోపించింది. ఉమ్మడి జిల్లాకు రాజకీయంగా పెద్దదిక్కుగా పరిగణించే పలమనేరు, పీలేరు ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, కిషోర్‌కుమార్‌రెడ్డిలు మంత్రివర్గంలో చోటు దక్కకపోవడంతో తమ తమ నియోజకవర్గాలకే పరిమితమయ్యారు.మండల, నియోజకవర్గ స్థాయిలో పనులకు ఎమ్మెల్యేలు కలెక్టర్, ఎస్పీలను కలుస్తున్నారు. అయితే ఆ పరిధి దాటి ప్రభుత్వంలో చేయించాల్సిన పనుల విషయంలో సమస్యలు ఎదురవుతున్నాయి. డివిజన్ స్థాయి అధికారుల నియామకాల్లో ఒకటికిమించి నియోజకవర్గాలు ముడిపడి ఉన్నందున ఎమ్మెల్యేల నడుమ ఏకాభిప్రాయం సాధనకు కూడా జిల్లాస్థాయి నాయకత్వం అవసరమవుతోంది. అలాగే సాగునీటికి, పరిశ్రమలకు, టూరిజం ప్రాజెక్టులకు సంబంధించి జిల్లాస్థాయి ప్రతిపాదనలు రూపొందించడంలోనూ, వాటిని ప్రభుత్వానికి పంపి మంజూరు చేయించడంలోనూ జిల్లా నాయకత్వం పాత్ర కీలకం. ఇపుడు ప్రత్యేకించి తిరుపతి జిల్లాకు ఆ లోటు ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. దీంతో జిల్లాలో కొత్త ప్రభుత్వం తాలూకా పాలన పూర్తిస్థాయిలో పట్టాలెక్కడానికి మరికొంత సమయం పట్టనుంది.

తుడాలో జీతాలకు

రూ.15కోట్లా?

- మంత్రి నారాయణ ఆశ్చర్యం
- టీడీఆర్ బాండ్లపై విచారణకు సహకరించాలని కార్పొరేషన్ అధికారులకు సూచన

తిరుపతి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థ, తుడా ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలని, ఎక్కడా నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ అధికారులకు సూచించారు. తుడా సమావేశ మందిరంలో సోమవారం మధ్యాహ్నం అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు.తిరుపతి నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను, చేపట్టనున్న పనులకు నిధుల అవసరం తదితర అంశాలపై తొలుత కమిషనర్ మౌర్య పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. మంత్రి స్పందిస్తూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రం నుంచి నిధులు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. త్వరలోనే నిధులు వస్తాయని, చక్కగా ప్లాన్ చేసుకుని అభివృద్ధి పనులకు వెచ్చించాలన్నారు. మున్సిపాలిటీలోని అన్ని విభాగాల అధికారులూ చేయాల్సిన అభివృద్ధి పనులపై ప్రణాళిక వేసుకోవాలన్నారు. టీడీఆర్ బాండ్ల కుంభకోణంలో జరుగుతున్న సీఐడీ, విజిలెన్స్ విచారణకు అధికారులు సహకరించి, సమాచారమివ్వాలన్నారు. తుడా పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై తుడా ఇంచార్జ్ వీసీ వెంకట నారాయణ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తుడాలో సిబ్బంది జీతాల కోసం ఏడాదికి రూ.15కోట్లు వెచ్చిస్తుండడం ఆశ్చర్యంగా ఉందన్నారు. రాష్ట్రంలోని మెజారిటీ పట్టణాభివృద్ధి సంస్థలు రూ.4కోట్ల కన్నా ఎక్కువ వెచ్చించడం లేదన్నారు. కాకినాడ రూ.3కోట్లు, రాజమండ్రి రూ.3.6 కోట్లు, ఏలూరు రూ.3కోట్లు, నెల్లూరు రూ.2.5కోట్లు, కర్నూలు రూ.2కోట్లు, కడప రూ2.6కోట్లు వెచ్చిస్తుంటే తుడాకు మాత్రం రూ.15కోట్లు ఎందుకవుతోందని మంత్రి ప్రశ్నించారు. రూ.15కోట్లు ఆదాయం వస్తుంటే అంతే మొత్తం ఖర్చుపెట్టేస్తే ఇక అభివృద్ధి పనులకు నిధులు ఎక్కడ నుంచి తెస్తారన్నారు. అన్ని వివరాలతో అమరావతికి రావాలని అధికారులను ఆదేశించారు. తుడా టవర్స్ నిర్మాణంలో ఆలస్యం చేస్తే లాభం అటుంచితే నష్టమే ఎక్కువ ఉంటుందన్నారు. తుడా లేఅవుట్లకు సంబంధించి 22ఏ వివాదం ఉందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకురాగానే...అప్పుడే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి 22ఏ నుంచి తుడా భూములను తొలగించాలని చెప్పారు. అదేవిధంగా తుడాకు ల్యాండ్ బ్యాంక్ ఉండేలా చూడాలన్నారు. కేంద్ర నిధుల కేటాయింపులో తిరుపతికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మంత్రిని కోరారు. టీడీఆర్ బాండ్లపై విచారణ త్వరితగతిన పూర్తిచేసి నిజమైన లబ్ధిదారులకు బాండ్లు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తిరుపతి రూరల్లో యూజీడీ సమస్య ఉందని, ట్రీట్మెంట్ ప్లాంట్ లేకపోవడం వలన ఇబ్బందిగా వుందని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.డ్రెయిన్స్ రిపేర్ చేయాలని, వీధులకు, బెంచీలకు వైసీపీ నాయకుల పేర్లను తొలగించాలని, శిల్పారామం పక్కన నింపిన చెరువు మట్టిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.తుడా నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలని కోరారు.నిధుల దుర్వినియోగంపై విచారణకు ఆదేశించామని, అభివృద్ధి పనులకు నిధులు ఇస్తామని మంత్రి నారాయణ చెప్పారు.


సమీక్ష సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి నారాయణ

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

తిరుపతి (నేరవిభాగం), ఆగస్టు 26 : తిరుపతిలో గంజాయిని దాచి విక్రయిస్తున్న ఇద్దరిని అలిపిరి పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వారినుంచి 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.వచ్చే 100 రోజుల్లో తిరుపతి జిల్లాను డ్రగ్ రహితంగా మార్చాలనే సంకల్పంతో గంజాయి, మాదక ద్రవ్యాల సేవనం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వంటివి అరికట్టడానికి ఎస్పీ సుబ్బరాయుడు ఓ టాస్క్‌ఫోర్సు బృందాన్ని ఏర్పాటు చేశారు.ఈ నేపథ్యంలో అలిపిరి సీఐ రాంకిషోర్ సిబ్బందితో కలసి కపిలతీర్థం రోడ్డు ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు.అనుమానాస్పద స్థితిలో కన్పించిన ఇద్దరు వ్యక్తులను పట్టుకుని విచారించగా వారి వద్ద గంజాయి బయటపడింది. చిత్తూరు జిల్లా సదుం మండలం యర్రాతివారిపల్లెకు చెందిన పట్టాభి గుణశేఖర్, ఏర్పేడు మండలం మేర్లపాక సమీపంలోని మన్నసముద్రం గ్రామానికి చెందిన కొండా మునిభరణిగా వారిని గుర్తించారు.గుణశేఖర్ బ్యాగులో 12 కిలోల గంజాయిని ,ముని భరణి బ్యాగులో 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.యశోదానగర్‌లోని గుణశేఖర్ రూములో గంజాయిని నిల్వ చేసి చిన్న చిన్న పొట్లాలు కట్టి అవసరమైన వారు ఫోన్ ద్వారా సంప్రదిస్తే తీసుకెళ్ళి విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైందని డీఎస్పీ వెంకటనారాయణ చెప్పారు. ముని భరణిపై గతంలో కూడా మూడు గంజాయి కేసులున్నట్లు చెప్పారు. గంజాయి ముఠాను అరెస్టు చేసిన డీఎస్పీ వెంకటనారాయణ, సీఐ రాంకిషోర్, సిబ్బందిని ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు. తిరుపతిలో ఎక్కడైనా మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్నా...వినియోగిస్తున్నా...గోడౌన్లలో స్టాకు పెట్టినట్లు తెలిసినా పోలీసు వాట్సాప్ నెంబరు 8099999977కు సమాచారం ఇవ్వాలని సూచించారు.


గంజాయి నిల్వలను, నిందితులను చూపుతున్న డీఎస్పీ వెంకటనారాయణ

13న మరో 75 అన్నక్యాంటీన్లు ప్రారంభం

మంత్రి నారాయణ

తిరుమల, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తమ ప్రభుత్వం వచ్చిన రెండు నెలల్లోనే వంద అన్నక్యాంటీన్లు ప్రారంభించామని, వచ్చేనెల 13వ తేదీన మరో 75 క్యాంటీన్లను కూడా ప్రారంభిస్తామని మంత్రి నారాయణ తెలిపారు. అలాగే అక్టోబరు నెలలో మిగిలిన అన్నక్యాంటీన్లు కూడా మొదలవుతాయన్నారు. తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం ప్రవేశపెడుతోందన్నారు. అలాగే అభివృద్ధిపరంగా కూడా సీఎం చంద్రబాబు విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. సీఎం సూచనలతో మంత్రులు, అధికారులు రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నారన్నారు. పరిశ్రమలు వస్తేనే యువతకు భవిష్యత్తు ఉంటుందన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



తిరుచానూరు, ఆగస్టు 26: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో సోమవారం చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన అలరించింది. తిరుపతికి చెంది న మంజుల కల్చరల్ ట్రస్టుకు చెరందిన కళాకారులు నృత్య ప్రదర్శన చేశారు. కళాకారులు విహాన్య ఎల్లంటి, మనుశ్రీరెడ్డి, సాన్విరెడ్డి, హేమవర్షిణిరెడ్డి, దీప్తి, నితిక, యషిక, నిహారిక చౌదరి, సాయి సుప్రజల, హన్సిక తదితరులు శ్రీవిష్ణురాజ్యం భజే, వచ్చెను అలిమేలు మంగ, రామచంద్రుడు ఇతడు, జయమంగళం వంటి కీర్తనలకు నృత్యం చేశారు. వీరిని శిల్పారామం ఏవో ఖాదరవల్లి సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

బ్రహ్మోత్సవాల రద్దీకి అనుగుణంగా భద్రతా ఏర్పాట్లు చేయండి : టీటీడీ సీవీఎస్వో

తిరుమల, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల రద్దీకి అనుగుణంగా భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను సీవీఎస్వో శ్రీధర్ ఆదేశించారు. అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో భద్రతపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సోమవారం టీటీడీ సీవీఎస్వో శ్రీధర్, అధికారులతో కలిసి మాడవీధులను పరిశీలించారు. వాహనమండపం, భక్తులు గ్యాలరీలలోనికి వచ్చే ప్రవేశ, వెలుపలకు వెళ్లే మార్గాలను పరిశీలించారు. అలాగే గ్యాలరీలోని ముఖ్యమైన ప్రాంతాలను పరిశీలించారు. ట్రాఫిక్ సమస్య లేకుండా వాహనాల పార్కింగ్, తదితర అంశాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈతనిఖీల్లో ఈఈలు సుబ్రహ్మణ్యం, సుధాకర్, డిప్యూటీఈవో ఆశాజ్యోతి, ఆరోగ్యశాఖ అధికారి మధుసూదన్‌రావు, వీఎస్వోలు సురేంద్ర, రామ్‌కుమార్, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రేణుక ఎల్లమ్మ తిరునాళ్ల



రామచంద్రాపురం, ఆగస్టు 26: మండలంలోని పరమాల దళితవాడలో సోమవారం రేణుకా ఎల్లమ్మ తిరునాళ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి వివిధ పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. పరిసర గ్రామాల ప్రజలు అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రకాష్‌స్వామి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆయనను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు.

మాజీ సర్పంచ్ గురవారెడ్డి కాంస్య విగ్రహావిష్కరణ



తిరుపతి రూరల్, ఆగస్టు 26: తిరుపతి రూరల్ మండలం పేరూరు గ్రామ మాజీ సర్పంచ్ బి.గురువారెడ్డి కాంస్య విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. పలువురు గ్రామస్తులు పాల్గొని పుష్పాంజలితో నివాళి అర్పించారు. సర్పంచ్‌గా, ఎంపీటీసీగా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కుటుంబసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

టీటీడీలో పలు విభాగాలపై ఈవో సమీక్ష



తిరుమల, ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి): టీటీడీలోని వివిధ విభాగాలపై ఈవో శ్యామల రావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి సోమవారం సమీక్షించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఈవో సమీక్ష జరిపారు. శాఖాపరమైన సమావేశాలలో భాగంగా శ్రీవారి ఆలయం, ఇంజినీరింగ్ పనులు, రెవెన్యూ, పంచాయతీ, రిసెప్షన్, పారిశుద్ధ్యం, అన్నప్రసాదం విభాగాలతో ఈవో సమీక్షించారు. ఆయా ప్రాంతాల్లో భక్తుల సౌకర్యార్థం చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధిపతులందరికీ సూచించారు. ఈసమావేశంలో జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, సీవీఎస్వో శ్రీధర్, సీఈ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీకి బ్రాండ్ ఆఫ్ ది డికేడ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న శ్రీసిటీ ప్రతినిధులు శివశంకర్, బోడ్గన్ జార్జ్

శ్రీసిటీ, ఆగస్టు 26: శ్రీసిటీకి మరో ప్రతిష్ఠాత్మక అవార్డు వరించింది. హెరాల్డ్ గ్లోబల్ ఇంటర్నే షనల్ బ్రాండ్ అడ్వర్టైజింగ్ రీసెర్చ్ అండ్ కన్సల్టింగ్ (బీఏఆర్‌సీ) ముంబైలో నిర్వహించిన గోల్డ్‌ఫెస్ట్ కాన్‌క్లేవ్ 2024లో బ్రాండ్ ఆఫ్ ది డికేడ్ అవార్డుతో శ్రీసిటీని సత్కరించింది. శ్రీసిటీ దశాబ్దకాలపు పారిశ్రామిక ప్రగతికి గుర్తింపు గా ఈ అవార్డు దక్కినట్లు శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆర్. శివశంకర్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ బోఎడ్గన్ జార్జ్ ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై శ్రీలంక రైతుల అధ్యయనం

కుప్పం, ఆగస్టు 26: ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం చేయడానికి శ్రీలంక రైతులు సోమవారం కుప్పం మండలంలో పర్యటించారు. శీగలపల్లె గ్రామాన్ని సందర్శించి, రైతు జి.కృష్ణమూర్తి పొలంలో చేస్తున్న సమీకృత వ్యవసాయ పద్ధతులను పరిశీలించారు. ఏటీఎం, ఏ గ్రేడ్ పద్ధతులలో కూరగాయల సాగు, వేరుశనగ యూనివర్సల్ మోడల్, ఎన్‌పీఎం షాప్ పద్ధతులను గురించి వారికి కృష్ణమూర్తి వివరించారు. సేంద్రియ ఎరువుల తయారీ, వాటిని పంటలకు వాడే విధానాల గురించి కూడా చెప్పారు. స్వయంసహాయక సంఘాల సభ్యులను కలిసిన శ్రీలంక రైతులు, ప్రకృతి వ్యవసాయం గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. చిత్తూరు జిల్లాలో సాగుతున్న ప్రకృతి వ్యవసాయం పద్ధతులను అధ్యయనం చేసిన అక్కడి రైతులు, ఇదు అద్భుతమని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల ఆరోగ్యంతోపాటు భూసారం కూడా పెరుగుతుందని తెలుసుకుని తాము కూడా ఈ వ్యవసాయం చేస్తామని చెప్పారు.

చంద్రగిరి



రాయలచెరువుపేటలో కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



గోవర్ధనగిరిపై ఊంజల్‌సేవ



కల్యాణోత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు

వైభవంగా పుష్పయాగం



రామచంద్రాపురం, ఆగస్టు26: రామాపురం ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఆలయంలో సోమవారం పుష్పయాగం వైభవంగా జరిగింది. 18రోజులపాటు అమ్మవారు వివిధసేవల్లో పాల్గొన్నారు. ద్రౌపదిని శాంతపరిచి సేద తీర్చేందుకు ప్రతియేటా ఉత్సవాలు ముగిసిన మరుసటి రోజు పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా మూలమూర్తులకు తిరుమంజనం నిర్వహించి పూజలు చేశారు. సాయంత్రం ద్రౌపదీదేవి సమేత ధర్మరాజును పుష్పార్చన చేశారు. ఈకార్యక్రమంలో ఉభయ దాత చంద్రశేఖర్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు.

వేడుకగా వేణుగోపాలస్వామి కల్యాణం

రామచంద్రాపురం, ఆగస్టు26: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా మండలంలోని రాయలచెరువుపేట, సొరకాయలపాళెం, నడవలూరు, రామాపురం గోవర్ధనగిరి, శ్రీశక్తిపీఠంలో రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం సోమవారం వేదమంత్రోచ్చరణల మధ్య రమణీయంగా జరిగింది. ఆలయాల్లో మూలమూర్తులకు తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. సాయంత్రం ఊంజల్‌సేవ అనంతరం మేళతాళాల నడుమ కల్యాణం కమనీయంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతిస్వామి, శక్తి పీఠాధీశ్వరి రమ్యానందభారతి స్వామి, చిన్మయనంద మిషన్ కార్యదర్శి రాజశేఖరెడ్డి పాల్గొన్నారు. అలాగే రాయలచెరువు కట్ట భవాని జలకంఠేశ్వర ఉపాలయంలో వెలసిన లక్ష్మీనారాయణస్వామికి తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేవారు. కార్యక్రమంలో ఉభయ దాత కఠారి భాస్కర్ నాయుడు పాల్గొన్నారు.



శక్తిపీఠంలో రాధాకృష్ణుల ప్రత్యేక అలంకరణ

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



చంద్రగిరి, ఆగస్టు 26: మండలంలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. పనపాకం పంచాయతీ, అరిగెలవారిపల్లెలోని శ్రీకృష్ణ మందిరంలో, చంద్రగిరి ద్వారక నగర్‌లోని జరిగిన వేడుకలకు ఎమ్మెల్యే పులివర్తినాని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు అర్చకస్వాములు పూర్ణకుంభంతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం భక్తిశ్రద్ధలతో గోపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తూరులో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

తిరుపతి రూరల్, ఆగస్టు 26: తిరుపతి రూరల్ మండలం కొత్తూరులోని రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణ దేవాలయంలో జన్మాష్టమి వేడుకలను సోమవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ఉదయం అభిషేకం నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం కుంకుమార్చన, కల్యాణోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం నిర్వహించిన ఉట్లోత్సవంలో యువత, గ్రామస్తులు ఉల్లాసంగా.. ఉత్సాహంగా పాల్గొన్నారు. స్వామివారి మూలమూర్తులను గ్రామంలో ఊరేగింపు చేశారు. నిర్వాహకులు వి.శ్రీనివాసులుయాదవ్, వార్తాల శివయాదవ్, వెంకట్రామయ్య, బాలసుబ్రమణ్యం, చెంచురామయ్య, నాగరాజు, మురళి, నవీన్, భాస్కరయ్య, నరేంద్ర, సాయి, బాబి, సుమంత్, మునస్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మీ కుటుంబానికి అండగా ఉంటా

అభిమానికి చిరంజీవి హామీ



ఈశ్వర్‌రాయల్ కుటుంబ సభ్యులకు దుస్తులందజేస్తున్న చిరంజీవి

రామచంద్రాపురం/తిరుమల, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): 'మీ కుటుంబానికి అండగా ఉంటా. నీకు ఏ సహాయం కావాలన్నా నన్ను అడుగు. నువ్వు ఎప్పుడైనా వచ్చి నన్ను కలవచ్చు' అంటూ ప్రముఖ సినీ హీరో చిరంజీవి తన అభిమానికి హామీ ఇచ్చారు. రామచంద్రాపురం మండలం బలిజపల్లికి చెందిన ఈశ్వర్‌రాయల్ మెగా అభిమాని. చిరంజీవితో పాటు పవన్‌కల్యాణ్‌కు మంచి ఆరోగ్యం ప్రసాదించాలని, రాజకీయంగా ఎదగాలని కోరుకుంటూ ఇప్పటికే అనేకసార్లు తిరుపతి నుంచి తిరుమలకు మెట్లపై పొర్లుదండాలతో వచ్చాడు. తిరుపతి నుంచి చిరంజీవి ఇంటి వరకు సైకిల్ యాత్ర కూడా చేశారు. ఈక్రమంలో ఈనెల 21వ తేదీన చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా కూడా పొర్లుదండాలతో తిరుమలకు వచ్చాడు. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన చిరంజీవి ఈశ్వర్‌రాయల్ గురించి తెలుసుకుని కుటుంబ సమేతంగా హైదరాబాద్‌కు వచ్చి తనను కలవాలని ఆహ్వానించారు. దీంతో ఈశ్వర్‌రాయల్ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం హైదరాబాద్‌లో చిరంజీవిని కలిశారు. ఈసందర్భంగా చిరంజీవి ఈశ్వర్‌రాయల్‌తో సహా కుటుంబాన్ని సత్కరించి దుస్తులు అందించారు. మీ కుటుంబానికి అండగా ఉంటానని, ఏ సహాయం కావాలన్నా వచ్చి అడుగు అంటూ హామీ ఇచ్చారు.

ఆగని ఇసుక దందా

- పొర్లుకట్టను తవ్వి దారి ఏర్పాటు
- రాత్రుల్లో యథేచ్ఛగా రవాణా



కప్పగుంటకండ్రిగ వద్ద పొర్లుకట్టను తవ్వి దారి ఏర్పాటు చేసుకున్న అక్రమార్కులు

పెళ్లకూరు, ఆగస్టు 26 : మండలంలో ఇసుకదందా ఆగడంలేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మట్టి ఇసుక, గ్రావెల్ దోపిడీ యథేచ్ఛగా సాగింది. అధికారులు సైతం ఇందుకు సహకరించారు. ఎన్డీయే కూటమి ఏర్పడ్డాక సమగ్ర విధానం అమలు చేసేందుకు నడుం బిగించినా ఇసుకాసురులు తమ కార్యకలాపాలను కొనసాగిస్తూనే ఉన్నారు. తాజాగా కప్పగుంటకండ్రిగ సమీపంలోని రాజగారితోట స్వర్ణముఖినది నుంచి ఇసుకను తరలించేందుకు జరుగుతున్న ప్రయత్నాలు నివ్వెరపరుస్తున్నాయి. పొర్లకట్టను తవ్వి వాహన రాకపోకలకు వీలుగా దారి సైతం ఏర్పాటు చేయడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. స్వర్ణముఖినదిలో నాణ్యమైన ఇసుక లభిస్తుండం కొందరు రాజకీయ నేతలకు అక్రమార్జన వనరుగా మారింది. ప్రభుత్వం ఏదైనా అధికారుల అండదండలు ఉంటే ఇసుక దోపిడీ సాగించవచ్చునని అక్రమార్కులు భావిస్తున్నారు. యడపూడి, పిడికిటమాల, కప్పగుంటకండ్రిగ, జీలపాటూరు తదితర గ్రామాల రైతులకు పొలాలకు, ప్రజల తాగునీటి అవసరాల కోసం బోరుబావులు ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడ తవ్వకాలు జరిపితే బోర్లలో నీరు అడుగంటి తాగు, సాగునీటికి ఇబ్బందులు తప్పవు. అయినా ఇసుక తవ్వకాలకు పాల్పడుతుండటంతో ఇక్కడి ప్రజలు కలవరపడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తవ్వకాలను నిలుపుదలకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇస్రో ప్రాజెక్టులపై అవగాహనకు శిక్షణ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్

సూళ్లూరుపేట, ఆగస్టు 26: ప్రయోగ పరికరాలు, ఉపగ్రహాలకు సంబంధించిన ప్రాజెక్టులపై సంస్థలో పలు విభాగాల మిడిల్ లెవల్ మేనేజర్లకు అవగాహన కల్పించాలని శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్ సంకల్పించింది. ఇందులో భాగంగా వారం రోజులపాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ ప్రారంభించారు. బ్రహ్మప్రకాష్ హాలులో జరిగిన శిక్షణ కార్యక్రమానికి యూఆర్‌ఎస్‌సీ డైరెక్టర్ ఎస్.శంకరన్ ముఖ్య అతిథిగా హాజరై పలు సూచనలు ఇచ్చారు. షార్ డైరెక్టర్ జ్యోతి ప్రజ్వళన చేశారు. షార్ డైరెక్టర్ మాట్లాడుతూ నిర్మాణ విషయాలపై ఇంజినీర్లు, సీనియర్ ఉద్యోగులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు అవసరమన్నారు. రాకెట్ ప్రయోగాకు సంబంధించి ఇస్రో ప్రాజెక్టుల్లో అందరి భాగస్వామ్యంతో సమర్థవంతంగా పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో షార్ డిప్యూటీ డైరెక్టర్ జి.రమేష్ బాబు. అసోసియేట్ డైరెక్టర్ సయ్యత్ అహమ్మద్, గ్రూపు డైరెక్టర్ గోపికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో జస్టిస్ ఎన్వీ రమణ



ఆలయం వద్ద జస్టిస్ ఎన్వీ రమణ తదితరులు

తిరుచానూరు, ఆగస్టు 26: సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీరమణ కుటుంబ సమేతంగా తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని సోమవారం దర్శించుకున్నారు. ఆలయం వద్ద జేఈవో వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవో గోవిందరాజన్ వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. మొదట ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం సన్నిధిలో అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం జస్టిస్ ఎన్వీ రమణను వేదపండితులు వేదాశీర్వచనం చేసి అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటన ఏర్పాట్ల పరిశీలన



చిల్లకూరు, ఆగస్టు 26:వచ్చేనెల 6న చిల్లకూరు మండలంలోని తమ్మినపట్నం గ్రామానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు రానున్న నేపథ్యంలో సోమవారం కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు స్థల పరిశీలన చేపట్టారు. తమ్మినపట్నంలో క్రిస్ సిటీ సెజ్ శంకుస్థాపన కార్యక్రమానికి వారిద్దరూ రానున్నట్లు సమాచారం. శంకుస్థాపన స్థలం, హెలిప్యాడ్ , సభాప్రాంగణం వంటి ఏర్పాట్లపై సోమవారం పరిశీలించారు.డీఎస్పీ రమణకుమార్, తహసీల్దారు శ్రీనివాసులు, ఏపీఐఐసీ జడ్ఎం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌లెంట్ ఫార్మా పేరుతో మోసపూరిత ఉద్యోగ ప్రకటనలు

నమ్మి మోసపోవద్దని యాజమాన్యం సూచన

శ్రీసిటీ, ఆగస్టు 26: శ్రీసిటీలోని ప్రముఖ పార్మలేషన్స్ పరిశ్రమ ఎక్సలెంట్ ఫార్మా సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట కొందరు మోసపూరిత ఉద్యోగ ప్రకటనలిస్తూ, నకిలీ వెబ్‌సైట్, ఈ మెయిల్ ఉపయోగిస్తున్నారని, అటువంటి ప్రకట నలు నమ్మవద్దంటూ ఆ కంపెనీ హెచ్ఆర్, అడ్మినిస్ట్రేషన్ సీనియర్ మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఎక్సలెంట్ ఫార్మా డాట్‌కామ్, హెచ్ఆర్అట్‌దిరైటాఫ్ ఎక్సలెంట్ ఫార్మా డాట్‌కామ్‌పేరుతో నకిలీ వెబ్‌సైట్, ఈ మెయిల్ ఐడీలను ఉపయోగిస్తూ కొందరు ఉద్యోగాలి ప్పిస్తామంటూ భారీగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. మోసగాళ్ల వలలో పడి ఎవరూ నష్టపోవద్దని, సంబంధిత వెబ్‌సైట్, ఈ మెయిల్ ఐడీలతో తమ కెలాంటి సంబంధంలేదని వివరించారు. కంపెనీ తరఫున వారిపై చర్యలు తీసుంటామని విజయభాస్కర్ రెడ్డి తెలిపారు.

మదగజం అఘాయిత్యంతోనే ఆడ ఏనుగు మృతి

ఎర్రావారిపాలెం, ఆగస్టు 26 : వెంట తీసుకొచ్చిన మదగజం దాడి వల్లే ఆడ ఏనుగు మృతి చెందిందని పోస్టుమార్టం నివేదికతో వెల్లడైంది.ఎర్రావారిపాలెం మండలం పులిబోనుపల్లె సమీపంలోని ఉరం గుట్ట వద్ద నాలుగురోజుల క్రితం మృతి చెందిన ఏనుగుకు సోమవారం పోస్టుమార్టం నిర్వహించారు. మృతి చెందిన ఏనుగు చెవుల నుంచి రక్తస్రావం జరిగిన్లు కనపడడంతో ఆంత్రాక్స్ వ్యాధి కావచ్చేమో అని తొలుత అనుమానించారు.నిర్ధారణ కోసం ఆ రక్తాన్ని తిరుపతిలోని ల్యాబ్‌కు పంపి పరీక్షించారు. ఫలితం నెగటివ్ రావడంతో ఆంత్రాక్స్ వ్యాధితో మరణించలేదని తేలింది.సీసీఎఫ్‌వో నాగేశ్వర రావు, డీఎఫ్‌వో సతీష్ , ఎస్వీ జూపార్క్ క్యూరేటర్ సెల్వన్, వైల్డ్ లైఫ్ డాక్టర్ తోయిబా సింగ్, ఎఫ్ఆర్వో దత్తాత్రేయ , సర్పంచ్ దేవేంద్ర తదితరుల సమక్షంలో జరిగిన పోస్టుమార్టంలో పలు ఆసక్తికర విషయాలు బయటపడ్డాయి. మృతి చెందిన ఏనుగుకు 16 సంవత్సరాలుంటాయి.9నెలల గర్భంతో వుంది.అయితే ఏనుగు పిండం చెదిరిపోయి వుంది.తలభాగం, తొండం , దంతాల వద్ద బలమైన గాయాలున్నాయి. శరీరంపై రెండు చోట్ల లోతుగా పోట్లు ఉన్నాయి. కడుపులో బలమైన గాయాలుండడం , శరీరంలో రక్తం గడ్డ కట్టి ఉండడం గమనించారు. ఏనుగు మరణించిన స్థలానికి దగ్గర్లో రెండు ఏనుగుల మధ్య పోట్లాట జరిగిన ఆనవాళ్లున్నాయి.చెట్లుకొమ్మలు విరిగిపోయి ఉండడం ,భూమిపై ఏనుగులు భీకరంగా తలపడినట్లు ఉండడంతో ఆడ ఏనుగుపై మదపుటేనుగు అఘాయిత్యానికి పాల్పడినట్లు ఎలిఫెంట్ రీసెర్చ్ సైంటిస్టు రాకేష్ కల్వ నిర్ధారించారు. దీంతో తొలుత ప్రచారం జరిగినట్లు ఏనుగు కరెంట్ తీగలు తగిలి మరణించిందనే విషయం నిజం కాదని తేలిపోయింది. విద్యుత్ లైన్ కూడా సంఘటనా స్థలానికి చాలా దూరంలో ఉండడం గమనార్హం.

శేషాచలంలో రెండు మందలుగా గజరాజులు

శేషాచల అడవుల్లో రెండు మందలుగా ఏనుగులు సంచరిస్తున్నాయని అటవీశాఖ అధికారులు తెలిపారు. 9 ఏనుగులతో కూడిన గుంపు కళ్యాణి డ్యాం కేంద్రంగా తిరుమల,మామండూరు,రంగంపేట అడవుల్లో జీవిస్తున్నాయి.మరో 20 ఏనుగుల గుంపు తలకోన ,సానిపాయి , తలకోన పేటు అడవుల్లో సంచరిస్తున్నాయి. సాధారణంగా మదపుటేనుగులను మిగతా ఏనుగులు మందకు దూరంగా ఉంచుతాయి . గుంపు యజమానిగా ఆడ ఏనుగులే వ్యవహరిస్తుంటాయి. గర్భంతో వున్న ఏనుగు మదపుటేనుగుతో మాత్రమే కలిసివచ్చింది.మధ్యలో దాంతో కలిసేందుకు మదపుటేనుగు ప్రయత్నించడంలో భాగంగా రెండింటి మధ్య పోరాటం జరిగింది. కోపంతో మదపుటేనుగు దాడి చేసిన క్రమంలోనే ఆడ ఏనుగు మృత్యువాత పడినట్లు అధికారులు నిర్ధారించారు.



ఏనుగు కళేబరానికి పోస్టుమార్టం

తిరుపతి



గోవింద రాజస్వామి ఆలయం నుంచి సూర్య ప్రభ వాహనంపై శ్రీకృష్ణుడి ఊరేగింపు







ఇస్కాన్ సమీపంలోని టీటీడీ మైదానంలో ఉట్టి కొడుతున్న యువత





తుడా మైదానంలో యాదవ సంఘాలు ఏర్పాటు చేసిన మధుర నమూనా ఆలయంలో ఎమ్మెల్యే ఆరణి - ఇస్కాన్‌లో ఎస్పీ సుబ్బరాయుడు



పూతలపట్టు మండలం పేటమిట్ట గ్రామంలోని కోదండరామస్వామి ఆలయం వద్ద రాధాకృష్ణులు, గోపికల వేషధారణలో ఉన్న చిన్నారులతో గల్లా రామచంద్రనాయుడు, అరుణకుమారి దంపతులు

నేడు టీటీడీ గోశాలలో గోకులాష్టమి వేడుకలు

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 26: శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని తిరుపతిలో టీటీడీకి చెందిన గోశాలలో మంగళవారం గోకులాష్టమి వేడుకలు జరుగుతాయి. గోశాలలో గోపూజ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉదయం 5 గంటల నుంచి 10.30 గంటల వరకు వేణుగానం, అనంతరం తిరుమల వేద పాఠశాల విద్యార్థులచే వేదపఠనం జరుగుతుంది. దాస సాహిత్య ప్రాజెక్టు కళాకారులతో భజనలు, కోలాటాలు నిర్వహిస్తారు. ఉదయం 10.30 గంటల నుంచి 11 గంటల వరకు గోపూజ, హారతి ఉంటుంది. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8.30 వరకు హిందూ ధర్మప్రచార పరిషత్ వారి హరికథా కాలక్షేపం జరుగుతుంది. ఈ సందర్భంగా గోశాలను సందర్శించే భక్తులు స్వయంగా గోవులకు బెల్లం, బియ్యం, పశుగ్రాసం తినిపించేందుకు టీటీడీ అనుమతిస్తోంది. ఈ వేడుకల కోసం టీటీడీ గోశాలను అందంగా ముస్తాబు చేసింది. మంగళవారం ఉదయం 10.30 గంటలకు టీటీడీ ఈవో దంపతులు ప్రత్యేక పూజలో పాల్గొంటారు. ● తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయంలో ఉదయం పార్థసారథి స్వామికి ప్రత్యేక పూజలు, సాయంత్రం 4.30 గంటల నుంచి 6.30 గంటల వరకు అభిషేకం, పురాణ ప్రవచనం, ఆస్థానం నిర్వహిస్తారు. ● కపిలతీర్థం ఆలయ ప్రాంగణంలో ఉన్న వేణుగోపాలస్వామి ఆలయంలో ఉదయం సుప్రభాతం, అభిషేకంతో జన్మాష్టమి వేడుకలు జరుగుతాయి. సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 8గంటల వరకు వేణుగోపాలుడి వీధి ఉత్సవం, అనంతరం గోకులాష్టమి ఆస్థానం జరుగుతుంది.

ఆదరణ వృద్ధాశ్రమంలో అన్నదానం



వృద్ధులకు అన్నదానం చేస్తున్న శ్రీనివాసులయాదవ్

తిరుపతి అర్బన్, ఆగస్టు 26: శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక భవానీనగర్‌లోని ఆదరణ వృద్ధాశ్రమంలో సోమవారం టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరి శ్రీనివాసులయాదవ్ అన్నదానం నిర్వహించారు. ఆశ్రమంలో ఉంటున్న వయోవృద్ధులకు ఉదయం, రాత్రి అల్పాహారాలు, మధ్యాహ్నం భోజనం అందించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకురాలు వసంతమ్మ, రవికుమార్, మహేశ్వరి, అంజనాదేవి తదితరులు పాల్గొన్నారు.


మహిళలు ఆర్థికంగా ఎదగాలి



డ్వాక్రా ఎగ్జిబిషన్‌ను పారంభిస్తున్న దేవకీ దేవి

తిరుపతి (ఆటోనగర్), ఆగస్టు 26: రాష్ట్రంలో మహిళలు వ్యక్తిగతంగా తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి ఆర్థికంగా ఎదగాలని అభ్యుదయ డ్వాక్రా స్టేట్ మహిళా నాయకురాలు కోటా కె.దేవకీదేవి అన్నారు. స్థానిక నెహ్రూమున్సిపల్ పాఠశాల మైదానంలో సోమవారం డ్వాక్రా సంఘాల అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. డ్వాక్రా మహిళలు తమ నైపుణ్యాలను మార్కెటింగ్ చేసుకోవడానికి ఇలాంటి అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు. కలంకారి శారీస్, డ్రస్సెస్, ఉప్పాడ పట్టువస్త్రాలు, గుజరాత్ వర్క్‌శారీస్, లక్నో నైటీస్, జైపూర్ టాప్స్, బెంగాలీ కాటన్ శారీస్, గృహ పరికరాలు వంటి పలు స్టాల్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ ప్రోగ్రాం గ్రామీణ డ్వాక్రా స్టేట్ కమిటీ ప్రెసిడెంట్ సీహెచ్ మహేశ్వరరావు, డ్వాక్రా సభ్యులు శైలజ, హేమలత, భాగ్యలక్ష్మి, చెంచు, తులసి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువ రైతు మృతి



పవన్‌కుమార్ మృతదేహం

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 26: విద్యుత్ షాక్‌తో యువ రైతు మృతి చెందిన సంఘటన సోమవారం సాయంత్రం తిరుపతి రూరల్ మండల పరిధిలోని గొల్లపల్లిలో చోటు చేసుకుంది. ఎంఆర్‌పల్లి ఎస్‌ఐ నాగేంద్రబాబు కథనం మేరకు... గొల్లపల్లికి చెందిన పవన్‌కుమార్ (25) తన పొలంలో కూరగాయలు, ఆకుకూరలు, ఇతరత్రా పంటలు సాగు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇంకా వివాహం కాలేదు. ఈ క్రమంలో సోమవారం తమ పొలం దున్నడానికి ట్రాక్టర్ వచ్చింది. ఈ క్రమంలో అక్కడ అడ్డుగా వున్న రాళ్లు పక్కకు తీస్తుండగా పైన వెళ్తున్న 11 కేవీ విద్యుత్ లైన్‌కు పొలంలో ఉన్న ఎర్త్ వైరు తగిలి విద్యుత్ షాక్‌తో పవన్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. జరిగిన ఘటనపై ఎంఆర్‌పల్లి ఎస్‌ఐ నాగేంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకోండి: ఏపీ రైతు సంఘం

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 26: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడానికి వచ్చిన విద్యుత్ అధికారులను ప్రజలు అడ్డుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రామానాయుడు సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వం అదానీ, షిర్డీ సాయి కంపెనీల ద్వారా వ్యవసాయ రైతు పంపుసెట్లకు, వినియోగదారుల మీటర్ల స్థానంలో ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను అమర్చడానికి ప్రయత్నించారన్నారు. ఆ సమయంలో టీడీపీ వ్యతిరేకించిందని, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం రెండు నాలుకల ధోరణితో వ్యవహరిస్తూ తిరిగి స్మార్ట్ మీటర్లు అమర్చడానికి ప్రయత్నిస్తుందని ఆరోపించారు. స్మార్ట్ మీటర్లు అమర్చడానికి వస్తే అడ్డుకోవాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 26: తిరుపతిలో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. భారీ ఎత్తున భక్తులు, మహిళలు, స్థానిక ప్రజలు, వీఐపీలు తరలిరావడంతో ఎస్పీ సుబ్బరాయుడు స్వయంగా బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఇస్కాన్ వద్ద ఏర్పాటు చేసిన భక్తుల క్యూలైన్లను పరిశీలించారు. ఆలయం చుట్టూ బ్యారికేడ్లు ఏర్పాటు చేసి భారీ బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోలేదు. తోపులాట జరగకుండా అలిపిరి సీఐ రాంకిషోర్ బృందం ముందస్తు చర్యలు తీసుకుంది. ఇస్కాన్ ఆలయానికి వచ్చే అన్ని దారులు మూసివేశారు.

స్వయంగా బందోబస్తు పర్యవేక్షించిన ఎస్పీ

కేవలం ఆలయానికి వచ్చే భక్తులను మాత్రమే అనుమతించారు. ఐదారు బ్యారికేడ్లు ఏర్పాటు చేసి దర్శన భాగ్యం కల్పించడంతో ప్రశాంతంగా సాగింది. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు.

ఆకట్టుకున్న ద్వారకా మధుర ఆలయ నమూనా...

తిరుపతి(కల్చరల్): శ్రీకృష్ణాష్టమి సందర్భంగా సోమవారం తుడా మైదానంలో యాదవ సంఘాలు ఏర్పాటు చేసిన ద్వారకా మధుర ఆలయ నమూనా భక్తులను ఆకట్టుకుంది. ఇక్కడ స్వామి వారిని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు దంపతులు, అన్నా రామచంద్రయ్య, అన్నా అనిత, సీనియర్ టీడీపీ నాయకులు మబ్బు దేవనారాయణరెడ్డి, బండి సుధాయాదవ్, జనసేన నగర అధ్యక్షులు రాజారెడ్డి తదితరులు దర్శించుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... తిరుపతి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని స్వామి వారికి మొక్కుకున్నట్లు తెలిపారు.

రామకృష్ణ ఆశ్రమంలో...

వినాయకనగర్‌లోని రామకృష్ణ ఆశ్రమంలో నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఉదయం 9 గంటలకు భగవద్గీత పారాయణం జరిగింది. సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు స్వామి విశ్వరాజానంద ఆధ్వర్యంలో భక్తులచే భజనలు నిర్వహించారు. అనంతరం స్వామి సత్వస్థానందచే శ్యామనామ సంకీర్తనం జరిగింది. 6.30 గంటలకు ఆరాత్రికం, 7 గంటలకు శ్రీకృష్ణ అష్టోత్తర శతనామావళి, అర్చన, రాత్రి 7.30 గంటలకు శ్రీకృష్ణ జన్మాష్టమి ప్రత్యేక పూజను ఆశ్రమ కార్యదర్శి స్వామి సుకృతానంద నిర్వహించారు.

తిరుపతి(విద్య): స్థానిక మంగళంలోని శ్రీనివాసా ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలువురు చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలతో సందడి చేశారు. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చైర్మన్ వి.సుబ్రమణ్యంరాజు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు మనసంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలైన పండుగలపై మరింత అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. డైరెక్టర్ మంజుల, టీచర్లు పాల్గొన్నారు.

రవీంద్రభారతిస్కూల్‌లో: కొర్లగుంటలోని రవీంద్రభారతి స్కూల్‌లో విద్యార్థుల రాధాగోపికలు, చిన్నికృష్ణుల వేషధారణలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ బి.రవీంద్రనాథరెడ్డి, టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.







రాధాగోపికల వేషధారణలో శ్రీనివాస, రవీంద్రభారతి పాఠశాలల విద్యార్థులు - ఇస్కాన్‌లో బందోబస్తు పర్యవేక్షిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేయండి

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ● కమిషనర్‌తో కలిసి సాగర్‌లో పనుల పరిశీలన

తిరుపతి (జీవకోన), ఆగస్టు 26: వినాయక చవితి సందర్భంగా విగ్రహాల నిమజ్జనానికి వినాయకసాగర్‌లో అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. సోమవారం కమిషనర్ మౌర్య, పోలీసు, నిమజ్జన కమిటీ ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే వినాయకసాగర్‌లో పనులను పరిశీలించారు. నిమజ్జనం నిర్వహించే కుంటలో తెలుగుగంగ నీటి ట్రయల్ రన్ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిమజ్జనం సందర్భంగా వినాయక సాగర్‌కు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వినాయక మండపాల వద్ద భద్రత కల్పించాలని, నిర్వాహకులు నిర్దిష్ట సమయంలో విగ్రహాలను నిమజ్జనానికి తరలించేలా చూడాలన్నారు. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా పోలీసుశాఖ అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజలందరూ పర్యావరణ హితమైన మట్టి విగ్రహాలనే వినియోగించాలని కమిషనర్ మౌర్య కోరారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ మోహన్, డీఎస్పీ వెంకట నారాయణ, సీఐలు రామకృష్ణ, రామకిషోర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు, నిమజ్జన మహోత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, సభ్యులు ఆర్సీ మునికృష్ణ, ఊకా విజయకుమార్, భానుప్రకాష్‌రెడ్డి, గుండాల గోపీనాథ్‌రెడ్డి, ఎస్వీఎం వెంకటేష్, కరాటే శ్రీనివాస్, చెన్నం నవీన్, రాజారెడ్డి, రుద్రకోటి సదాశివం, సింగంశెట్టి సుబ్బరామయ్య, వెంకటరత్నం, రవిశంకర్‌రెడ్డి, ఆర్కాట్ కృష్ణప్రసాద్, దండు విజయ్ తదితరులు పాల్గొన్నారు.



వినాయకసాగర్ వద్ద పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరణి, కమిషనర్ మౌర్య, నిమజ్జన కమిటీ సభ్యులు

యూపీఎస్ అమలు హామీ ఉద్యోగుల తొలి విజయం

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 26: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు నూతన పింఛను విధానం స్థానంలో యూనిఫైడ్ పెన్షన్ సిస్టంను అమలు చేస్తామని ప్రధాన మంత్రి హామీ ఇవ్వడంతో ఇది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల తొలి విజయంగా భావిస్తున్నామని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ గుంతకల్లు డివిజన్ అధ్యక్షుడు కె.సుదర్శన్ రాజు పేర్కొన్నారు. సోమవారం రైల్వేస్టేషన్‌లోని ఐవోహెచ్ షెడ్ ఎదుట కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 20 ఏళ్ల క్రితం అప్పటి కేంద్ర ప్రభుత్వం నూతన పింఛను విధానాన్ని అమలు చేసిందన్నారు. నాటి నుంచి నేటివరకు రైల్వే ఉద్యోగులు చేసిన నిరంతర పోరాటాల ఫలితమే నేడు ప్రధాన మంత్రి ఎన్‌పీఎస్ స్థానంలో యూపీఎస్ అమలు చేస్తామని హామీ ఇవ్వడమని హర్షం వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రితో చర్చలు జరిపిన వారిలో కీలక పాత్ర పోషించిన శివగోపాల్‌మిశ్రా, శంకర్‌రావు, విజయకుమార్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీంద్రనాయక్, నారాయణస్వామి, డి.రాధయ్య, మారయ్య, రోహిణి తదితరులు పాల్గొన్నారు.



తిరుపతి రైల్వే స్టేషన్ ఐవోహెచ్ షెడ్ వద్ద యూపీఎస్ అమలుపై హర్షం వ్యక్తం చేస్తున్న రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు

రేణిగుంటలో...

రేణిగుంట రైల్వేస్టేషన్‌లో మజ్దూర్ యూనియన్ నాయకులు సురేష్ ఆధ్వర్యంలో అన్ని విభాగాలకు వెళ్లి ఉద్యోగులందరినీ కలసి మిఠాయిలను పంచిపెట్టారు. తమ పోరాటం ఫలించిందని సురేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జి.నరేష్, కె.గంగరాజు, నారాయణ, పోలయ్య, ఏఆర్ సిన్హా, సుధాకర్, రమేష్, రోషన్, రాజేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యం వికటించి ఇంటర్ విద్యార్థిని మృతి!

కుటుంబ సభ్యులు, బంధువుల ఆరోపణ.. ఆగ్రహం ● పలమనేరులో క్లినిక్ అద్దాలు పగలగొట్టిన యువకులు

పలమనేరు, ఆగస్టు 26: 'జ్వరంతో వెళితే వైద్యం చేశారు. ఇంటికెళ్లగానే తీవ్ర అస్వస్థతకు గురైంది. పెద్ద ఆస్పత్రులకు తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. తొలుత చేసిన వైద్యం వికటించడం వల్లే ఇంటర్ విద్యార్థిని తేజశ్రీ (16) మృతి చెందింది' అంటూ ఆమె కుటుంబీకులు, బంధువులు, స్థానికులు ఆగ్రహించారు. పలమనేరులోని శ్రీనివాసా క్లినిక్ అద్దాలను సోమవారం పగలగొట్టారు. బాధితులు తెలిపిన ప్రకారం.. పలమనేరు సమీపం నాగమంగళం వద్ద పారిశ్రామిక వాడకు చెందిన జయచంద్ర కుమార్తె తేజశ్రీ స్థానిక ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతోంది. జ్వరంతో బాధపడుతున్న ఈమెను గురువారం పలమనేరు టీకే స్ట్రీట్‌లో పోలీసు స్టేషన్‌కు ఎదురుగా 'సోగ్రాపాతిమా బీయుఎంఎస్, రాణాప్రతాప్ బి.ఫార్మ్' అనే వారు నడుపుతున్న శ్రీనివాస క్లినిక్‌కు తీసుకొచ్చారు. ఆమెకు ఇంజక్షన్ వేసి మాత్రలు ఇచ్చి పంపించారు. ఇంటికి వెళ్లిన వెంటనే తేజశ్రీ తీవ్ర అస్వస్థతకు గురవడంతో చిత్తూరు సమీపంలోని సీఎంసీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి తిరుపతి లోని స్విమ్స్‌కు తీసుకెళ్లినా ఆమె కోలుకోలేదు. అటుపిమ్మట రాణిపేటలోని అపోలో ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తేజశ్రీ తుది శ్వాస విడిచింది. ఆమె కుటుంబీకులు, బంధువులు, స్నేహితులు తేజశ్రీ మృతదేహాన్ని సాయంత్రం అంబులెన్సులో తీసుకొచ్చి శ్రీనివాస క్లినిక్ ముందు ఉంచి నిరసన తెలిపారు. ఆ తర్వాత కోపోద్రిక్తులైన కొందరు యువకులు క్లినిక్ ముందున్న అద్దాలను పగులగొట్టి షట్టర్‌ను మూసేశారు. పోలీసు స్టేషను ముందే వందలాది మంది గుమికూడి ఉండటంతో పోలీసులు, మహిళా ఎస్‌ఐ ఆందోళనకారుల వద్దకు వచ్చారు. సంఘటనపై ఫిర్యాదు ఇస్తే తాము తగిన చర్యలు తీసుకొంటామని వారికి నచ్చచెప్పారు. దీంతో వారు ఆందోళన విరమించి వెళ్లిపోయారు. ఈ విషయమై పోలీసులను విచారించగా సంఘటనపై తమకు ఇప్పటి వరకు ఫిర్యాదు రాలేదని తెలిపారు.



తేజశ్రీ (ఫైల్ ఫొటో)



క్లినిక్‌ను ధ్వంసం చేస్తున్న యువకులు

అట్టహాసంగా క్రీడా సంబరాలు ప్రారంభం



ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 26: జాతీయ క్రీడాదినోత్సవంలో భాగంగా సోమవారం పలు మైదానాలలో క్రీడా సంబరాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజున టీటీడీ విద్యాసంస్థలు, ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల, ఎస్జీఎస్, ఎస్వీ ఓరియంటల్, ఎస్పీడబ్ల్యూడీ, ఎస్వీ జూనియర్ కాలేజీలలో ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ చేయించారు. అలాగే చెన్నారెడ్డి కాలనీ, అన్నమయ్య సర్కిల్ సమీపంలో ఉన్న ఎస్సీ, బీసీ వసతి గృహాలలో విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సయ్యద్‌సాహెబ్, కాలేజీ ప్రిన్సిపాళ్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.01 కోట్లు

తిరుమల, ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.01 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు రూ.4.01 కోట్లు ఆదాయం లభించినట్టు టీటీడీ సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 84,060 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే 34,985 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

కుంభాభిషేక వేడుకల్లో శాస్త్రోక్తంగా హోమం



సూళ్లూరుపేట, ఆగస్టు 26: మన్నారుపోలూరులోని సత్యా జాంబవతి సమేత అలఘు మల్లారి కృష్ణస్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో జరుగుతున్న అష్టబంధన మహాకుంబాభిషేక వేడుకల్లో భాగంగా సోమవారం హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణ మండపంలో కలశస్థాపన చేశారు. హోమగుండాలు ఏర్పాటు చేసి యాగశాల వాస్తుపూజలు, రక్షాబంధనం, అష్ట బంధన సమర్పించారు. యాగశాలలో అకల్మష హోమాన్ని వేదపండితులు వైభవంగా నిర్వహించారు. కోవిల్ అళ్వార్ తిరుమంజనం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉపాధ్యాయుల క్రికెట్ పోటీలు



క్రికెట్ పోటీలో పాల్గొన్న ఉపాధ్యాయులు

గూడూరు అర్బన్, ఆగస్టు 26: స్థానిక అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల క్రికెట్ లీగ్ పోటీలు సోమవారం ఉత్సాహంగా కొనసాగాయి. సేవాసంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని తిరుపతి, నెల్లూరు జిల్లాల్లోని 19 మండలాలకు చెందిన టీములు పాల్గొంటున్నాయన్నారు. కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, ధనుంజయరెడ్డి, జగదీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. పొదలకూరు జట్టుపై దక్కిలి ఉపాధ్యాయ జట్టు విజయం సాధించింది. జట్టును అభినందిస్తూ ఏపీ ప్రజాసంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గద్దల మునెయ్య రూ.2వేలు ప్రోత్సాహక నగదు బహుమతి అందజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



అర్జీలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సునీల్

గూడూరు, ఆగస్టు 26: ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చెప్పారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలను పరిశీలించి సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు, పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉట్టి మహోత్సవం



ఓజిలి, ఆగస్టు 26 : మండలంలో సోమవారం కృష్ణాష్టమి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఓజిలి, కురుగొండ, మానమాల, అరిమేనిపాడు, అత్తివరం, వీర్లగునుపాడు, వెంకటరెడ్డిపాళెం గ్రామాల్లో కృష్ణునికి నైవేద్యాలు సమర్పించుకున్నారు. ఓజిలి ప్రధాన వీధిలో ఉట్టి మహోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. యువకులు, పిల్లలు, గ్రామస్తులు ఆసక్తిగా పాల్గొన్నారు.

వెటరన్ ఫుట్‌బాల్ పోటీల్లో ప్రథమ స్థానం



నాయుడుపేట, ఆగస్టు 26: విశాఖపట్నం రైల్వే క్రీడా ప్రాంగణంలో ఈనెల 23, 24, 25 తేదీల్లో నిర్వహించిన వెటరన్ ఫుట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు ప్రథమస్థానం సాధించింది. టీములో నాయుడుపేటకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచారని ఫుట్‌బాల్ కోచ్ సయ్యద్ గౌస్‌బాషా సోమవారం మీడియాకు తెలిపారు. ఏపీ, తెలంగాణ తమిళనాడు, ఒడిశా రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు ఇందులో పాల్గొన్నారన్నారు. మూడు రోజులపాటు పోటీలు జరిగాయన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఆయన అభినందించారు.

మురుగునీరు పోయేందుకు మార్గమేదీ?



నాయుడుపేట, ఆగస్టు 26: స్థానిక పాత ట్రెజరీ ఆఫీసు ఎదురుగా సిమెంట్ రోడ్డు రూపుకోల్పోయింది. మురుగునీటిమయంగా మారింది. ఈ ప్రాంతంలో ఉన్నత పాఠశాల కూడా ఉంది. విద్యార్థులు రోజూ ఆ మురుగునీటి నడుమ పాఠశాలకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అనేక పర్యాయాలు మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. సిమెంట్ రోడ్డు నిర్మించి, డ్రైనేజీ కాలువ ఏర్పాటు చేసినా మురుగునీరు పోయేందుకు సరైన మార్గం లేకపోవడంతో ఎప్పటికప్పుడు రోడ్డుపైనే నిలిచిపోతోంది. మున్సిపాలిటీ అధికారులు స్పందించాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

13న మరో 75 అన్నక్యాంటీన్లు ప్రారంభం
మంత్రి నారాయణ

తిరుమల, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తమ ప్రభుత్వం వచ్చిన రెండు నెలల్లోనే వంద అన్నక్యాంటీన్లు ప్రారంభించామని, వచ్చేనెల 13వ తేదీన మరో 75 క్యాంటీన్లను కూడా ప్రారంభిస్తామని మంత్రి నారాయణ తెలిపారు. అలాగే అక్టోబరు నెలలో మిగిలిన అన్నక్యాంటీన్లు కూడా మొదలవుతాయన్నారు. తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం ప్రవేశపెడుతోందన్నారు. అలాగే అభివృద్ధిపరంగా కూడా సీఎం చంద్రబాబు విశేషంగా కృషి చేస్తున్నారన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.01 కోట్లు

తిరుమల, ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.01 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 84,060 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే 34,985 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

బ్రహ్మోత్సవాల రద్దీకి అనుగుణంగా
భద్రతా ఏర్పాట్లు చేయండి: సీవీఎస్వో

తిరుమల, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల రద్దీకి అనుగుణంగా భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను సీవీఎస్వో శ్రీధర్ ఆదేశించారు. అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో భద్రతపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సోమవారం టీటీడీ సీవీఎస్వో శ్రీధర్, అధికారులతో కలిసి మాడవీధులను పరిశీలించారు. వాహనమండపం, భక్తులు గ్యాలరీలలోనికి వచ్చే ప్రవేశ, వెలుపలకు వెళ్లే మార్గాలను పరిశీలించారు. అలాగే గ్యాలరీలోని ముఖ్యమైన ప్రాంతాలను పరిశీలించారు. ఈ తనిఖీల్లో ఈఈలు సుబ్రహ్మణ్యం, సుధాకర్, డిప్యూటీఈవో ఆశాజ్యోతి, ఆరోగ్యశాఖ అధికారి మధుసూదన్‌రావు, వీఎస్వోలు సురేంద్ర, రామ్‌కుమార్, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా: డ్రైవరుకు గాయాలు



చిల్లకూరు, ఆగస్టు 26: ఆటో బోల్తాపడిన సంఘటనలో ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు... సోమవారం గూడూరు వైపు నుంచి ఓజిలి వైపు ముగ్గురు ప్రయాణికులతో వెళుతోంది. ఈ క్రమంలో బూదనం టోల్‌ప్లాజా వద్ద అదుపుతప్పి ఆటో బోల్తాపడింది. దీంతో ఆటో డ్రైవర్ కాలేషాకు గాయాలయ్యాయి. అతడిని గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అదృష్టవశాత్తూ ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురికి ఎలాంటి గాయాలు తగలలేదు.

నేడు పాలచ్చూరులో ప్రజాభిప్రాయ సేకరణ

పెళ్లకూరు, ఆగస్టు 26 : పాలచ్చూరు పరిధిలోని సెజ్‌లో పరిశ్రమల ఏర్పాటుపై మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ జరగనుంది. దీనికి జిల్లా జాయింట్ కలెక్టర శుభమ్ హాజరవుతారని తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి తెలిపారు. ఆదిత్యా బిర్లా గ్రూపు ఏర్పాటు చేయనున్న పరిశ్రమ స్థాపనపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

తిక్కవరంలో గడ్డివామి దగ్ధం

చిల్లకూరు, ఆగస్టు 26: మండలంలోని తిక్కవరం గ్రామంలో గడ్డివామి దగ్ధమైంది. స్థానికుల కథనం మేరకు గ్రామానికి చెందిన వెంకటయ్య గడ్డివామిలో గుర్తుతెలియని వ్యక్తులు సిగరెట్ పీకను వేశారు. దీంతో గడ్డివామిలో ఒక్కసారిగా మంటలు వ్యాప్తిచెందాయి. స్థానికులు గుర్తించి గూడూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే గడ్డివామి కాలిపోయింది. రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితుడు వెంకటయ్య తెలిపాడు.

రెండు బైకుల ఢీ - ఒకరి మృతి



పుల్లయ్య (ఫైల్‌ఫొటో)

వాకాడు, ఆగస్టు 26 : రెండు బైక్‌లు ఢీ కొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలి వి.తూపిలిపాళెం గ్రామానికి చెందిన తులసంగారి పుల్లయ్య (37) సోమవారం తన కుమారుడికి సదరన్ సర్టిఫికెట్లను తీసుకువచ్చేందుకు బైకు మీద నెల్లూరు వెళ్లాడు. తిరిగి తూపిలిపాళెంకు వస్తుండగా అందలమాల, తూపిలిపాళెం మధ్యలో మరో బైకు ఢీకొంది. దీంతో పుల్లయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. అవతలి బైకులో ప్రయాణిస్తున్న గూడలికి చెందిన ముఖేష్‌మరో మహిళ గాయపడ్డారు. వీరిద్దరినీ గూడూరులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగబాబు తెలిపారు.

పేద విద్యార్థులకు చేయూత



పవన్‌కుమార్‌కు చెక్కును అందజేస్తున్న రమణయ్య

కోట, ఆగస్టు 26 : చదువుకోవాలన్న తపన ఉన్న పేద విద్యార్థులకు అండగా ఉంటామని షిరిడీసాయి అక్షయ సేవాసమితి కన్వీనర్ అల్లం రమణయ్య చెప్పారు. నాయుడుపేట మండలం అన్నమేడుకు చెందిన పవన్ కృష్ణమాచార్యులు అనే విద్యార్థికి ముక్కర నవీన్‌బాబు-భవ్య దంపతుల(చెన్నై) రూ. 10వేల సాయాన్ని ప్రకటించారు. కోటలోని షిరిడీసాయి అక్షయ సేవాసమితి కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఈ ఆర్థిక సాయాన్ని రమణయ్య అందజేశారు. ఏటా ఇదేవిధంగా సాయం అందజేస్తామని హామీ ఇచ్చార. సీతారామధార్మికసంఘం ప్రతినిధులు,ఆవుల సుబ్బయ్య, వెంకటరమణారెడ్డి, బాబురావు, అనంతాచార్యులు, పుల్లారెడ్డి, దామోదర్, పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై కేసు నమోదు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 26 : కూచివాడలో భూఆక్రమణదారులపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. గ్రామంలో స్వర్ణముఖి పొరంబోకు భూమిని కొందరు ఆక్రమించుకున్నారని తహసీల్దారు గీతావాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు 18 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. తనను చంపుతానని ప్రసన్న అనే వ్యక్తి బెదిరిస్తున్నారని పెరికలంపాటికండ్రిగ గ్రామానికి చెందిన శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఆయన తెలిపారు.



దేవదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డిని నాయుడుపేటకు చెందిన టీడీపీ నాయకుడు కట్టా వెంకటరమణారెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. -నాయుడుపేట

బాలగోపాలుడికి ఊరూవాడా పూజలు





దక్కిలి మండలం చాపలపల్లిలో శ్రీకృష్ణుని ఊరేగింపు- చిన్నమాంబట్టులో ఉట్టి కొడుతున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

సూళ్లూరుపేట, ఆగస్టు 26: షార్ బస్టాండు, పీర్ల చావడి వద్ద జై గణేశ్ ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. కేఆర్‌పాలెంలోని సాయి సత్సంగ మందిరంలో హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. నాదెండ్లవారి కండ్రిగలో కృష్ణమందిరంలో అభిషేకంతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు వేనాటి రామచంద్రారెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి, చిట్టేటి పెరుమాల్ పాల్గొన్నారు. **గూడూరు:** స్థానిక రాజావీధిలోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయం వద్ద భక్తుల సహకారంతో ఫ్రెండ్స్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైభవోపేతంగా వేడుకలు జరిగాయి. రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణుడుకి ప్రత్యేక పూజలు చేశారు. తప్పెట్లు, తాళాలతో గ్రామోత్సవం జరిపారు. కృష్ణుడు, పాండవ, కౌరవుల వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్న కృష్ణుడి బొమ్మల కొలువు ఆకట్టుకుంది. అనంతరం అన్నదానం నిర్వహించారు. సాయి సత్సంగ్ నిలయంలో కోట సునీల్ కుమార్ ఆధ్వర్యంలో పూజలు జరిపారు. త్యాగరాజ వీధిలోని గీతామందిరంలో స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. **పెళ్లకూరు:**అక్కగారిపేట, కప్పగుంటకండ్రిగ, చెన్నప్పనాయుడుపేట, చెంబేడు, జీలపాటూరు తదితర గ్రామాల్లో ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. **దక్కిలి** : చాపలపల్లిలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణ భగవానుడిని ఊరేగించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు వెంకటరత్నమ్మ పర్యవేక్షణలో శ్రీకృష్ణుడి ప్రతిమను పూలతో అలంకరించి ఊరేగించారు. దక్కిలి, వెంబులూరు, మోపూరు గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. **వెంకటగిరి** : మదరకాడమి పాఠశాలలో కృష్ణుని వేషధారణలో విద్యార్థుల కోలాట నృత్య ప్రదర్శన ఆకట్టు కొంది. స్థానిక పాలకేంద్రం సెంటరు వద్ద ఆలయంలో భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. **వెంకటగిరిటౌన్:** రాపూరు క్రాస్ రోడ్డు వద్ద కృష్ణమందిరం, బంగారుపేటలోని వేణుగోపాల స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానం చేశారు. **తడ:** చిన్నమాంబట్టులోని కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణాదేవి ఆలయంలో. గోపూజ నిర్వహించారు. సాయంత్రం ఉట్టి మహోత్సవంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ దంపతులు పాల్గొని ఉట్టి కొట్టారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమాలలో ఎమ్మెల్యేతోపాటు టీడీపీ నాయకులు పార్థసారథి, మురళీ రెడ్డి, పురుషోత్తం, తిరుపతి సిమ్స్ వైద్యులు మునస్వామి, అన్నదాన కమిటీ ఛైర్మన్ దేవేంద్రరెడ్డి పాల్గొన్నారు.



గూడూరులో భక్తులకు అన్నదానం

ఆగని ఇసుక దందా

- పొర్లుకట్టను తవ్వి దారి ఏర్పాటు
- రాత్రుల్లో యథేచ్ఛగా రవాణా



కప్పగుంటకండ్రిగ వద్ద పొర్లకట్టను తవ్వి దారి ఏర్పాటు చేసుకున్న అక్రమార్కులు

పెళ్లకూరు, ఆగస్టు 26 : మండలంలో ఇసుకదందా ఆగడంలేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మట్టి ఇసుక, గ్రావెల్ దోపిడీ యథేచ్ఛగా సాగింది. అధికారులు సైతం ఇందుకు సహకరించారు. ఎన్డీయే కూటమి ఏర్పడ్డాక సమగ్ర విధానం అమలు చేసేందుకు నడుం బిగించినా ఇసుకాసురులు తమ కార్యకలాపాలను కొనసాగిస్తూనే ఉన్నారు. తాజాగా కప్పగుంటకండ్రిగ సమీపంలోని రాజగారితోట స్వర్ణముఖి నది నుంచి ఇసుకను తరలించేందుకు జరుగుతున్న ప్రయత్నాలు నివ్వెరపరుస్తున్నాయి. పొర్లకట్టను తవ్వి వాహన రాకపోకలకు వీలుగా దారి సైతం ఏర్పాటు చేయడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. స్వర్ణముఖినదిలో నాణ్యమైన ఇసుక లభిస్తుండం కొందరు రాజకీయ నేతలకు అక్రమార్జన వనరుగా మారింది. ప్రభుత్వం ఏదైనా అధికారుల అండదండలు ఉంటే ఇసుక దోపిడీ సాగించవచ్చునని అక్రమార్కులు భావిస్తున్నారు. యడవూడి, పిడికిటమాల, కప్పగుంటకండ్రిగ, జీలపాటూరు తదితర గ్రామాల రైతులకు పొలాలకు, ప్రజల తాగునీటి అవసరాల కోసం బోరుబావులు ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడ తవ్వకాలు జరిపితే బోర్లలో నీరు అడుగంటి తాగు, సాగునీటికి ఇబ్బందులు తప్పవు. అయినా ఇసుక తవ్వకాలకు పాల్పడుతుండటంతో ఇక్కడి ప్రజలు కలవరపడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తవ్వకాలను నిలుపుదలకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ప్రధాని పర్యటన ఏర్పాట్ల పరిశీలన

చిల్లకూరు, ఆగస్టు 26:వచ్చేనెల 6న చిల్లకూరు మండలంలోని తమ్మినపట్నం గ్రామానికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు రానున్న నేపథ్యంలో సోమవారం కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు స్థల పరిశీలన చేపట్టారు. తమ్మినపట్నంలో క్రిస్ సిటీ సెజ్ శంకుస్థాపన కార్యక్రమానికి వారిద్దరూ రానున్నట్లు సమాచారం. శంకుస్థాపన స్థలం, హెలిప్యాడ్ , సభాప్రాంగణం వంటి ఏర్పాట్లపై సోమవారం పరిశీలించారు.డీఎస్పీ రమణకుమార్, తహసీల్దారు శ్రీనివాసులు, ఏపీఐఐసీ జడ్‌ఎం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇస్రో ప్రాజెక్టులపై అవగాహనకు శిక్షణ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్

సూళ్లూరుపేట, ఆగస్టు 26: ప్రయోగ పరికరాలు, ఉపగ్రహాలకు సంబంధించిన ప్రాజెక్టులపై సంస్థలో పలు విభాగాల మిడిల్ లెవల్ మేనేజర్లకు అవగాహన కల్పించాలని శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్ సంకల్పించింది. ఇందులో భాగంగా వారం రోజులపాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ ప్రారంభించారు. బ్రహ్మప్రకాష్ హాలులో జరిగిన శిక్షణ కార్యక్రమానికి యూఆర్ఎస్‌సీ డైరెక్టర్ ఎస్.శంకరన్ ముఖ్య అతిథిగా హాజరై పలు సూచనలు ఇచ్చారు. షార్ డైరెక్టర్ జ్యోతి ప్రజ్వళన చేశారు. షార్ డైరెక్టర్ మాట్లాడుతూ నిర్మాణ విషయాలపై ఇంజినీర్లు, సీనియర్ ఉద్యోగులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు అవసరమన్నారు. రాకెట్ ప్రయోగాకు సంబంధించి ఇస్రో ప్రాజెక్టుల్లో అందరి భాగస్వామ్యంతో సమర్థవంతంగా పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో షార్ డిప్యూటీ డైరెక్టర్ జి.రమేష్ బాబు. అసోసియేట్ డైరెక్టర్ సయ్యత్ అహమ్మద్, గ్రూపు డైరెక్టర్ గోపికృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరిసాకు నివాళులు



వాకాడు, ఆగస్టు 26 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో సోమవారం మదర్ థెరిసా జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి వైస్ ప్రిన్సిపాల్ విజయకుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ జాతి వైషమ్యాలు లేకుండా దీనులకు అండగా నిలిచిన మాతృమూర్తి మదర్ థెరిసా అన్నారు. నిస్సాహాయులకు మదర్ థెరిసానిరంతరం సహాయం అందించి విశ్వమాతగా నిలిచారన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటగిరిలో తాగునీటి కోసం నిత్యం తిప్పలే..

లీకేజిలకు మరమ్మతులు చేసి సరఫరా చేస్తాం: కమిషనర్

వెంకటగిరిటౌన్, ఆగస్టు 26: తాగునీటి కోసం పట్టణ ప్రజలు అల్లాడుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలో 25వార్డుల్లోనూ నాలుగు నెలలుగా మున్సిపాలిటీ నీరు సక్రమంగా సరఫరా కావడంలేదు. ప్రతి ఇంటికీ మున్సిపల్ కుళాయి ఉన్నా నామమాత్రమైందని మహిళలు వాపోతున్నారు. ఉదయం 6.30 గంటలకు మున్సిపల్ నీరు వదులుతారు. తరువాత 15 నిమిషాలకే ఆపేస్తున్నారు. గతంలో 6.30 నుంచి 7.30వరకు వచ్చేవి. తాగునీరు ఉదయం 10నుంచి 11గంటల వరకు వదిలేవారు. మున్సిపాలిటీ ట్యాంకర్లు శివారు ప్రాంతాలకు వెళ్లేందుకేనని అధికారులు చెబుతున్నారు. కానీ వాటర్ ట్యాంకర్లను పక్కదారి పట్టించి అధికారులు లబ్ధి పొందుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అలంకార ప్రాయంగా వాటర్ ట్యాంకులు

మున్సిపాలిటీలో ఐదు లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకులు నాలుగున్నాయి. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుంచి శుద్ధి చేసిన జలాలను ట్యాంకులకు పంపిస్తారు. అయితే నీటిని వదిలే సిబ్బంది మొక్కుబడిగా పనిచేస్తున్నారు. నాలుగు రోజులు ముందు మున్సిపల్ కమిషనర్‌కు తొలిమిట్టలో నీరు రావడం లేదని ఫిర్యాదు చేశారు. కమిషనర్ పరిశీలించి రెండు రోజుల్లో పైపులైన్ లీకేజిలకు మరమ్మతులు చేయించి నీటిని వదులుతామన్నారు. వారమైనా నీరు రాకపోవడంతో మహిళలు రోడ్డుపై బైఠాయించారు. గతంలో మున్సిపాలిటీ నీరు రానపుడు తొలిమిట్టలో బోరులో తాగునీరు పట్టుకుని వాడుకునేవారు. ఓ ఆకతాయి వల్ల బోరు కూడా పనిచేయడంలేదు. ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని స్థానికులు నిరాశ చెందుతున్నారు. పైపులైన్ లీకేజీలు సరిచేసి నీరు సరఫరా చేయిస్తామని మున్సిపల్ కమిషనర్ రషీద్ చెప్పారు. బోర్లు రిపేరు చేయించి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.



నీటి కోసం రోడ్డుపై ఇటీవల ధర్నా చేస్తున్న మహిళలు

మదగజం అఘాయిత్యంతోనే ఆడ ఏనుగు మృతి

ఎర్రావారిపాలెం, ఆగస్టు 26 : వెంట తీసుకొచ్చిన మదగజం దాడి వల్లే ఆడ ఏనుగు మృతి చెందిందని పోస్టుమార్టం నివేదికతో వెల్లడైంది.ఎర్రావారిపాలెం మండలం పులిబోనుపల్లె సమీపంలోని ఉరం గుట్ట వద్ద నాలుగురోజుల క్రితం మృతి చెందిన ఏనుగుకు సోమవారం పోస్టుమార్టం నిర్వహించారు. మృతి చెందిన ఏనుగు చెవుల నుంచి రక్తస్రావం జరిగిన్లు కనపడడంతో ఆంత్రాక్స్ వ్యాధి కావచ్చేమో అని తొలుత అనుమానించారు.నిర్ధారణ కోసం ఆ రక్తాన్ని తిరుపతిలోని ల్యాబ్‌కు పంపి పరీక్షించారు. ఫలితం నెగటివ్ రావడంతో ఆంత్రాక్స్ వ్యాధితో మరణించలేదని తేలింది.సీసీఎఫ్‌వో నాగేశ్వర రావు, డీఎఫ్‌వో సతీష్ , ఎస్వీ జూపార్క్ క్యూరేటర్ సెల్వన్, వైల్డ్ లైఫ్ డాక్టర్ తోయిబా సింగ్, ఎఫ్ఆర్వో దత్తాత్రేయ , సర్పంచ్ దేవేంద్ర తదితరుల సమక్షంలో జరిగిన పోస్టుమార్టంలో పలు ఆసక్తికర విషయాలు బయటపడ్డాయి. మృతి చెందిన ఏనుగుకు 16 సంవత్సరాలుంటాయి.9నెలల గర్భంతో వుంది.అయితే ఏనుగు పిండం చెదిరిపోయి వుంది.తలభాగం, తొండం , దంతాల వద్ద బలమైన గాయాలున్నాయి. శరీరంపై రెండు చోట్ల లోతుగా పోట్లు ఉన్నాయి. కడుపులో బలమైన గాయాలుండడం , శరీరంలో రక్తం గడ్డ కట్టి ఉండడం గమనించారు. ఏనుగు మరణించిన స్థలానికి దగ్గర్లో రెండు ఏనుగుల మధ్య పోట్లాట జరిగిన ఆనవాళ్లున్నాయి.చెట్లు,కొమ్మలు విరిగిపోయి ఉండడం ,భూమిపై ఏనుగులు భీకరంగా తలపడినట్లు ఉండడంతో ఆడ ఏనుగుపై మదపుటేనుగు అఘాయిత్యానికి పాల్పడినట్లు ఎలిఫెంట్ రీసెర్చ్ సైంటిస్టు రాకేష్ కల్వ నిర్ధారించారు. దీంతో తొలుత ప్రచారం జరిగినట్లు ఏనుగు కరెంట్ తీగలు తగిలి మరణించిందనే విషయం నిజం కాదని తేలిపోయింది. విద్యుత్ లైన్ కూడా సంఘటనా స్థలానికి చాలా దూరంలో ఉండడం గమనార్హం.

శేషాచలంలో రెండు మందలుగా గజరాజులు

శేషాచల అడవుల్లో రెండు మందలుగా ఏనుగులు సంచరిస్తున్నాయని అటవీశాఖ అధికారులు తెలిపారు. 9 ఏనుగులతో కూడిన గుంపు కళ్యాణి డ్యాం కేంద్రంగా తిరుమల,మామండూరు,రంగంపేట అడవుల్లో జీవిస్తున్నాయి.మరో 20 ఏనుగుల గుంపు తలకోన సానిపాయి , తలకోన పేటు అడవుల్లో సంచరిస్తున్నాయి. సాధారణంగా మదపుటేనుగులను మిగతా ఏనుగులు మందకు దూరంగా ఉంచుతాయి . గుంపు యజమానిగా ఆడ ఏనుగులే వ్యవహరిస్తుంటాయి. గర్భంతో వున్న ఏనుగు మదపుటేనుగుతో మాత్రమే కలిసివచ్చింది.మధ్యలో దాంతో కలిసేందుకు మదపుటేనుగు ప్రయత్నించడంలో భాగంగా రెండింటి మధ్య పోరాటం జరిగింది. కోపంతో మదపుటేనుగు దాడి చేసిన క్రమంలోనే ఆడ ఏనుగు మృత్యువాత పడినట్లు అధికారులు నిర్ధారించారు.



ఏనుగు కళేబరానికి పోస్టుమార్టం

వృద్ధులను ఆదరించడం అభినందనీయం: విజయశ్రీ



నాయుడుపేట టౌన్, ఆగస్టు 26: వృధాశ్రమాల ద్వారా సేవలందించగం అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. సంజాయ్‌గాంధీ కాలనీలోని మేరీ వృధాశ్రమం వార్షికోత్సవం సందర్భంగా సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యంతో కలసి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆశ్రమ నిర్వాహకులు సునీతాబెన్నిలను అభినందించారు. వృద్ధులకు దుస్తులను, పండ్లు, రొట్టెలు అందజేశారు. తమ కుమారుడు జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వాహకులకు రూ.5వేల నగదు అందజేశారు. మున్సిపల్ వైస్‌ఛైర్మన్ రఫీ, టీడీపీ నాయకులు మైలారి రాజశేఖర్, గాదిరెడ్డి గోపీ, ఎగుదల విజయకుమార్, పార్థసారధి, టికె శ్రీనివాసులు, సెల్వం, బాబు, చెంగయ్య, చక్రపాణి, ముత్యాలయ్య తదితరులు పాల్గొన్నారు.

జోరుగా అభివృద్ధి పనులు: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 26: శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయని టీడీపీ నేతలు అన్నారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ బొజ్జల సుధీర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన వారం రోజుల్లోనే ముక్కంటి ఆలయంలో ప్రక్షాళన చేపట్టి ఆదాయాన్ని గణనీయంగా పెంచారని వివరించారు. రాజీవ్‌నగర్‌లో వైసీపీ నేతల అక్రమ నిర్మాణాలను కూల్చివేయడంతో పాటు పలువురు నిరుపేద లబ్ధిదారులకు ఇంటి స్థలాలు అప్పగించడంతో ప్రజల నుంచి పెద్దఎత్తున ప్రశంసలు వ్యక్తమయ్యాయన్నారు. వసతిగృహాలను తనిఖీ చేసి యుద్ధప్రాతిపదికన అభివృద్ధికి బాటలు వేశారని తెలిపారు. ఇందులో భాగంగా ఇంటిగ్రేటెడ్, కాసాగార్డెన్, ఎస్టీ బాలికల వసతిగృహాలను రెండు నెలల్లోనే అభివృద్ధి చేయడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి హర్షం వ్యక్తమవుతోందన్నారు. పురపాలక సంఘం పరిధిలో 6.5కిలోమీటర్ల పొడవున రూ.50లక్షలతో మురుగు కాలువల్లో పూడిక తొలగింపు ద్వారా డ్రైనేజీ వ్యవస్థను ప్రక్షాళన చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, పార్లమెంటు కోశాధికారి కంఠా రమేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెంచయ్య నాయుడు, నాయకులు మిన్నల రవి, సుబ్బారెడ్డి, గోపి, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పోలేరమ్మ జాతర



పిచ్చాటూరు, ఆగస్టు 26: మండలంలోని హనుమంతాపురంలో పోలేరమ్మ జాతరలో భాగంగా మొదటి రోజు సోమవారం గ్రామోత్సవం నిర్వహించారు. మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ గెరిగె ఊరేగించారు. అలాగే మండల కేంద్రానికి సమీపంలో ఉన్న రెప్పాలపట్టు గ్రామంలో నూతనంగా నిర్మించిన కొత్త నాంచారమ్మ ఆలయంలో కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా సోమవారం గ్రామదేవతలకు పొంగళ్లు పెట్టారు. వేద పండితులు మేళతాళాల నడుమ శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విఘ్నేశ్వర పూజ, స్వస్తి వాచకం, ప్రవేశ బలి, వాస్తుశాంతి, వాస్తుపూజ, వాస్తుహోమం, మృత్యుగ్రహణం, గంగపూజ, అంకురార్పణ, రక్షాబంధనం, దీపపూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



ఆలయ ధ్వజస్తంభం వద్ద జస్టిస్ దుప్పాల వెంకటరమణ

శ్రీకాళహస్తి, ఆగస్టు 26: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుపాల వెంకటరమణ, తెలంగాణ రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ హనుమంతరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం



బాధితులకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు, ఆగస్టు 26: మండలంలోని రాజగోపాలపురం ఎస్టీకాలనీకి చెందిన రమేష్, లక్ష్మమ్మ దంపతులు పూరిల్లు షార్ట్ సర్క్యూట్‌తో ఆదివారం దగ్ధమైన విషయం తెలిసిందే. ఎమ్మెల్యే ఆదిమూలం సోమవారం రాజగోపాలపురానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. తక్షణ సాయంగా నిత్యావసర వస్తువులతో పాటు ఆర్థిక సహాయం అందించి వారికి భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా అందాల్సిన అన్ని సహాయ సహకారాలను వెంటనే అందించాలని అధికారులను ఆదేశించారు. పక్కా ఇళ్ల మంజూరు చేసి బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పరమశివం, రోశయ్య, సుబ్రహ్మణ్యంరాజు, చిన్న, గుర్రప్ప, చంద్రమోహన్, మధు, జనసేన మండల అధ్యక్షుడు రూపేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే యూపీఎస్ ప్రకటనపై ఉద్యోగుల హర్షం



హర్షం వ్యక్తం చేస్తున్న రైల్వే ఉద్యోగులు

రేణిగుంట, ఆగస్టు 26: కేంద్ర ప్రభుత్వం రైల్వే యూపీఎస్ పెన్షన్ అందిస్తున్నట్లు ప్రకటించడం పట్ల సీఆర్ఎస్‌లోని ఏఐఆర్ఎఫ్, ఎస్‌సీఆర్ ఎంయూ సంఘం కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. పంచిపెట్టి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో రైల్వే సంఘం నాయకులు సదాశివరెడ్డి, మునికుమార్, హెన్రీపాల్, మునిరాజయ్య, చంద్ర నాయక్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్పేస్ క్విజ్‌లో లోకో పైలెట్ మణి ప్రతిభ



శ్రీకాళహస్తి, ఆగస్టు 26: నేషనల్ స్పేస్‌డే క్విజ్‌లో తొట్టంబేడు మండలం పూడి గిరిజనకాలనీకి చెందిన కంపా మణి ప్రతిభ చూపాడు. నేషనల్ వాటర్ అకాడమీ, సెంట్రల్ వాటర్ కమిషన్ సంయుక్తంగా నిర్వహించిన ఆన్‌లైన్ స్పేస్ క్విజ్‌లో లోకో పైలెట్‌గా పనిచేస్తున్న కంపా మణి తృతీయ స్థానం సాధించి ధృవపత్రంతో పాటు రూ.50 నగదు పారితోషికం అందుకున్నాడు. ఆయనను పలువురు అభినందించారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 26: కరాటేలో శ్రీకాళహస్తి విద్యార్థులు ప్రతిభ చూపారు. కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ పట్టణంలోని నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్ ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో శ్రీకాళహస్తికి చెందిన సింహపురి కరాటే అకాడమీకి చెందిన కోచ్ ధనుష్ ఆధ్వర్యంలో ఐదు పతకాలు సాధించారు. 25 కేజీల విభాగంలో ప్రఖ్యాత బంగారు పతకం, 35 కేజీల విభాగంలో క్లారీస్ బంగారు పతకం, 28 కేజీల విభాగంలో నమస్వి బంగారు పతకం, 27 కేజీల విభాగంలో కుశాంత్‌కుమార్ రజత పతకం, 21 కేజీల విభాగంలో తన్విశ్రీ రజత పతకం సాధించారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

విద్యార్థి అదృశ్యంపై ఎంఈవో విచారణ



విద్యార్థులను విచారిస్తున్న ఎంఈవో రవీంద్రనాథ్

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 26: కనమనంబేడు గ్రామంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో పదవ తరగతి విద్యార్థి లోకేష్ అదృశ్యంపై ఎంఈవో రవీంద్రనాథ్ సోమవారం విచారణ చేపట్టారు. లోకేష్ పాఠశాల నుంచి ఎలా అదృశ్యం అయ్యాడో ప్రిన్సిపాల్ ధర్మేంద్రసింగ్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే లోకేష్ సహచర విద్యార్థులను విచారించారు. డీఈవోకు సమగ్ర నివేదిక అందజేస్తామని ఎంఈవో చెప్పారు.

మృత్యుంజయస్వామికి పూజలు



ప్రత్యేకాలంకారంలో మృత్యుంజయస్వామి

శ్రీకాళహస్తి, ఆగస్టు 26: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయ స్వామికి సోమవారం వేదోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకస్వామికి పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం మృత్యుంజయ స్వామికి మొదట పాలు, పంచామృతం, చందనం, విభూతి, పచ్చకర్పూరంలో వైభవంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వివిధ పుష్పాలతో, గజమాల, వెండి నాగాభరణంతో స్వామివారిని శోభాయమానంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు, మహామంగళ హారతులు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

చెంగాళమ్మ పరమేశ్వరి తిరునాళ్లు



ఊంజల్‌సేవలో అమ్మవారు

వరదయ్యపాళెం, ఆగస్టు 26: మండల కేంద్రంలో వెలసిన చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో వారం రోజులుగా జరుగుతున్న తిరునాళ్లు సోమవారం అంబరాన్నంటాయి. అమ్మవారు సింహవాహనంపై ఆసీనులై వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ పట్టణ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. జనసేన నాయకుడు జానకీరామ్, టీడీపీ నాయకుడు నిర్మల్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాటకచేరి ఆకట్టుకుంది. ఈకార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బొప్పన తిలక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐకి సన్మానం



ఎస్‌ఐను సన్మానిస్తున్న సర్పంచు, నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 26: బుచ్చినాయుడు కండ్రిగ ఎస్‌ఐ విశ్వనాథ నాయుడును కాటూరు పంచాయతీ సర్పంచు చిరంజీవి, టీడీపీ నాయకులు శశికుమార్ యాదవ్, రామనాథం, పరుశురామ్, కాటయ్య సోమవారం మర్యాద పూర్వకంగా కలసి శాలువతో సన్మానించారు.

ధనంజయులు మృతి టీడీపీకి తీరని లోటు

కేవీబీపురం, ఆగస్టు 26: టీడీపీ నాయకుడు ధనంజయులు మృతి పార్టీకి తీరని లోటని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. సోమవారం రాళ్లమిట్ట గ్రామానికి చేరుకుని ధనంజయులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఘనంగా గోకులాష్టమి వేడుకలు



ముక్కంటి ఆలయంలో శ్రీకృష్ణుడికి పూజలు - బీఎన్‌కండ్రిగలో శ్రీకృష్ణుడి చిత్రపటం ఊరేగింపు - ఏర్పేడు మండలం బండారుపల్లెలో ఉట్టి కొడుతున్న చిన్నారులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 26: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో సోమవారం గోకులాష్టమి వేడుకలు నిర్వహించారు. ఆలయ భిక్షాల గాలిగోపురం వద్ద ఉన్న సప్తగోకులం, దక్షిణగోపురం వద్ద ఉన్న సప్తగోకులం, భరద్వాజతీర్థంలో ఉన్న గోశాలలో గోవులకు పూజలు చేశారు. గోమాతలకు నైవేద్యం సమర్పించారు. గోశాలలోని శ్రీకృష్ణ భగవానుడికి విశేష అలంకారాలు చేసి పూజలు నిర్వహించారు. భక్తులు గోమాతలకు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తి, అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

ఏర్పేడు: ఆమందూరు పంచాయతీ ఎర్రగుట్ట వద్ద యాదవ సంఘం మండల అధ్యక్షుడు ఊటీ చంద్రశేఖర్‌యాదవ్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి పూజలు చేశారు. కటారి గురవయ్య ఆధ్వర్యంలో భజనలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచు బొడుగు బాలగురునాథం యాదవ్, మాజీ ఎంపీటీసీ లత, నాయకులు మూర్తి చంద్రశేఖర్ యాదవ్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. అలాగే బండారుపల్లిలో ఉన్న శ్రీకృష్ణ ఆశ్రమంలో కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. చిన్నారులు శ్రీకృష్ణుని వేషంలో ఉట్లు కొట్టారు. అనంతరం కోలాట భజనలు వేసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎంపీపీ వెంకటరెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి, మాజీ సర్పంచు శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని శ్రీకృష్ణ మందిరంలో యోగా గురువు సురేష్ నాయుడు ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. మహిళలు, విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేసిన వేషధారణతో ఆకట్టుకున్నారు. అలాగే మండలంలోని కాంపాళెం, గాజులపెళ్లూరు గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి.

వరదయ్యపాళెం: మండలంలోని సుబ్బరాజు కండ్రిగలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తుల కోలాటం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ముత్తయ్యరాజు, నారాయణస్వామి, వెంకటేశ్వరరాజు, రామసుందరరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే అంబికాపురంలోని శ్రీకృష్ణ ఆశ్రమంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు.

శ్రీసిటీకి బ్రాండ్ ఆఫ్ ది డికేడ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న శ్రీసిటీ ప్రతినిధులు శివశంకర్, బోడ్గన్ జార్జ్

శ్రీసిటీ, ఆగస్టు 26: శ్రీసిటీకి మరో ప్రతిష్ఠాత్మక అవార్డు వరించింది. హెరాల్డ్ గ్లోబల్ ఇంటర్నేషనల్ బ్రాండ్ అడ్వర్టైజింగ్ రీసెర్చ్ అండ్ కన్సల్టింగ్ (బీఏఆర్‌సీ) ముంబైలో నిర్వహించిన గోల్డ్‌ఫెస్ట్ కాన్‌క్లేవ్ 2024లో బ్రాండ్ ఆఫ్ ది డికేడ్ అవార్డుతో శ్రీసిటీని సత్కరించింది. శ్రీసిటీ దశాబ్దకాలపు పారిశ్రామిక ప్రగతికి గుర్తింపుగా ఈ అవార్డు దక్కినట్లు శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆర్. శివశంకర్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ బోడ్గన్ జార్జ్ ఒక ప్రకటనలో తెలిపారు.

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి: సీపీఐ



భూములను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

ఏర్పేడు, ఆగస్టు 26: ముసలిపేడు రెవెన్యూ పరిధిలో ఎస్టీలకు చెందిన సాగు భూములను కబ్జా చేసిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి అన్నారు. సోమవారం ముసలిపేడు సమపంలో ఉన్న ఎస్టీల భూములను సీపీఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ ఎస్టీలు సాగుచేసుకుంటున్న భూములను వైసీపీ నేతలు తమ పేరు మీద ఆన్‌లైన్ చేయించుకోవడం దుర్మార్గమన్నారు. కలెక్టర్ స్పందించి అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు చిన్నం పెంచులయ్య, రాధాకృష్ణ, జనమాల గురవయ్య, మించల శికుమార్, మణి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాపారికి తీవ్రగాయాలు



గాయపడిన సులేమాన్

శ్రీకాళహస్తి, ఆగస్టు 26: రోడ్డు ప్రమాదంలో సులేమాన్(50) అనే చికెన్ వ్యాపారి తీవ్రంగా గాయపడ్డాడు. శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన సులేమాన్ ఆర్టీసీ కూడలి వద్ద చికెన్ దుకాణం నిర్వహిస్తుంటాడు. సోమవారం ద్విచక్ర వాహనంపై పట్టణశివారులోని రాజీవ్‌నగర్‌కాలనీ వద్దకు వెళ్లి వస్తుండగా పిచ్చాటూరు రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన సులేమాన్‌ను స్థానికులు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎక్సలెంట్ ఫార్మా పేరుతో

మోసపూరిత ఉద్యోగ ప్రకటనలు

నమ్మి మోసపోవద్దని యాజమాన్యం సూచన

శ్రీసిటీ, ఆగస్టు 26: శ్రీసిటీలోని ప్రముఖ ఫార్మలేషన్స్ పరిశ్రమ ఎక్సలెంట్ ఫార్మా సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట కొందరు మోసపూరిత ఉద్యోగ ప్రకటనలిస్తూ, నకిలీ వెబ్‌సైట్, ఈ మెయిల్ ఉపయోగిస్తున్నారని, అటువంటి ప్రకటనలు నమ్మవద్దంటూ ఆ కంపెనీ హెచ్ఆర్, అడ్మినిస్ట్రేషన్ సీనియర్ మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఎక్సలెంట్ ఫార్మా డాట్‌కామ్, హెచ్ఆర్ అట్ ది రైటాఫ్ ఎక్సలెంట్ ఫార్మా డాట్‌కామ్ పేరుతో నకిలీ వెబ్‌సైట్, ఈ మెయిల్ ఐడీలను ఉపయోగిస్తూ కొందరు ఉద్యోగాలిప్పిస్తామంటూ భారీగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. మోసగాళ్ల వలలో పడి ఎవరూ నష్టపోవద్దని, సంబంధిత వెబ్‌సైట్, ఈ మెయిల్ ఐడీలతో తమకెలాంటి సంబంధంలేదని వివరించారు. కంపెనీ తరఫున వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని విజయభాస్కర్ రెడ్డి తెలిపారు.

పరిశ్రమల్లో కార్మికులకు రక్షణ కల్పించండి



పుష్పిత్ స్టీల్స్ కర్మాగారం ఎదుట నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

ఏర్పేడు, ఆగస్టు 26: పరిశ్రమల్లో కార్మికులకు రక్షణ కరువైందని, భద్రత లేక సిబ్బంది మృత్యువాత పడుతున్నారని సీపీఎం నాయకుడు పుల్లయ్య అన్నారు. మేర్లపాక పుష్పిత్ స్టీల్స్ కర్మాగారం వద్ద సీపీఎం నాయకులు సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేర్లపాక వద్ద ఉన్న పుష్పిత్ స్టీల్స్‌లో కార్మికులకు భద్రత కరువైందన్నారు. నిబంధనల ప్రకారం రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని మండి పడ్డారు. కార్మికుల రక్షణను గాలికి వదిలేస్తున్న పరిశ్రమలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. నాలుగురోజుల క్రితం బిహార్ రాష్ట్రానికి చెందిన కార్మికుడి మృతి అనుమానాస్పదంగా ఉందన్నారు. మృతుడి కుటుంబానికి రూ.కోటి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రంగయ్య, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

రేణిగుంట, ఆగస్టు 26: శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకుని సోమవారం మధ్యాహ్నం స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద యాదవ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

తాగునీటి సమస్య పరిష్కారం

పిచ్చాటూరు, ఆగస్టు 26: మండలంలోని నీరువాయి పంచాయతీలో తాగునీటి బోరు మరమ్మతులకు గురికావడంతో స్థానికులు సర్పంచు సుగ్రీవ వెంకటేశులు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన సర్పంచు మోటారు మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించారు. గ్రామస్తులు సర్పంచుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు




పుత్తూరు, వడమాలపేటలో విశేష అలంకరణలో శ్రీకృష్ణుడు

పుత్తూరు టౌన్, ఆగస్టు 26: పుత్తూరు పట్టణంలోని కామాక్షీ సమేత సదాశివేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వెలసిన గీతా మందిరంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరణ, అఖండ గీతా పారాయణం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి శ్రీకృష్ణ భగవానుడిని దర్శించుకున్నారు.

వడమాలపేట: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ ఆలయంలో సోమవారం అభిషేకం నిర్వహించారు. ప్రభుత్వ వైద్యశాల సీహెచ్‌వో పురుషోత్తం రెడ్డి మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



పుత్తూరు టౌన్, ఆగస్టు 27: పుత్తూరు పట్టణంలోని శ్రీనివాస వైద్యశాల వెనుక కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న గుర్తు తెలియని వృద్ధుడిని శనివారం పోలీసులు గుర్తించి ప్రభుత్వ వైద్యశాల తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడు వయస్సు 65 సంవత్సరాలు ఉంటుంది. తెల్లని పంచె, చొక్కా ధరించి ఉన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్‌ఐ వెంకటమోహన్ తెలిపారు.

పుత్తూరు వార్తలు

కూలిన విద్యుత్ స్తంభం

తప్పిన ప్రమాదం



పుత్తూరు టౌన్, ఆగస్టు 26: పుత్తూరు పట్టణంలోని స్వామివీధిలో సోమవారం సాయంత్రం ఓ విద్యుత్ స్తంభం అకస్మాత్తుగా కూలిపోయింది. వీధి పక్కనున్న స్తంభం ఎదురుగా ఉన్న బిల్డింగ్‌పై పడిపోవడంతో విద్యుత్ లైన్లు ఒకదానికొకటి తగిలి సరఫరా నిలిచిపోయింది. అదే వీధిలో రెండు ప్రైవేటు పాఠశాలలు, ఒక కళాశాల ఉండడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. సోమవారం కృష్ణాష్టమి సందర్భంగా సెలవు కావడంతో విద్యార్థులు ఎవరు లేరు. దీంతో పెద్దప్రమాదం తప్పింది.

సీపీఎం నేతకు నివాళి

పుత్తూరు టౌన్, ఆగస్టు 26: పుత్తూరు పట్టణంలో సీఐటీయూ కార్యాలయంలో సోమవారం సీపీఎం నేత కుప్పానాయుడు వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వందవాసి నాగరాజు, గురవమ్మ, సీఐటీయూ నాయకులు విజయకుమారి, అంబికా, భాస్కర్, విజయ్, యాసిన్ భాషా, పురుషోత్తం, నరసింహులు, కృష్ణమూర్తి, కుప్పానాయుడు కుటుంబ సభ్యులు గోపాల నాయుడు, భాస్కర్ రావు, వేణు తదితరులు పాల్గొన్నారు.